ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275


ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 13-05- 2026 | సంపుటి: 17, సంచిక: 40, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే

# కఠిన చర్యలు

- రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి
- మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం



హైదరాబాద్,/పెద్దపల్లి, మే12: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దనసరి అనసూయ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి ఐడీఓసీ నుండి పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసు సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటం వల్ల కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# నీట్ రద్దు..

## త్వరలో పరీక్ష నిర్వహిస్తామన్న ఎన్టీఏ

రాజస్థాన్‌లో పేపర్ లీక్ వార్తల దుమారం

లీకేజీ ఆరోపణలతో విచారణ కోసం కేసు సీబీఐకి అప్పగింత

డెహ్రాడూన్ నుంచి లీకై వాట్సాప్‌లో ఫార్వార్డ్ అయిన పేపర్




న్యూఢిల్లీ, మే 12 : జాతీయ వైద్య విద్య అర్హత ప్రవేశ పరీక్ష(నీట్-యూజీ) 2026కు సంబంధించిన ప్రశ్నాపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు దుమారం రేపుతున్నాయి. ఈ ప్రశ్నాపత్రం పలుమార్లు వాట్సాప్‌లో ఫార్వార్డ్ కావడంతో వెలుగులోకి వచ్చింది. ఈ ప్రశ్నాపత్రం ఒకచోట లీక్ అయినప్పటికీ, పలువురికి ఇది చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో మే 3వ తేదీన జరిగిన నీట్ (యూజీ) పరీక్షను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వెల్లడించింది. త్వరలో కొత్త తేదీలను ప్రకటిస్తామని తెలిపింది. ఇటీవలే జరిగిన ఈ పరీక్షకు 22 లక్షలమంది విద్యార్థులు హాజరయ్యారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో, దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఐ విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని, విచారణ సంస్థకు కావాల్సిన అన్ని వివరాలను అందజేస్తామని ఎన్టీఏ తెలిపింది. ఇప్పటికి ఈ ఆరోపణలపై రాజస్థాన్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ) దర్యాప్తు జరుపుతోంది.

**లీకైన పేపర్.. ఒకరి నుంచి ఒకరికి ఇలా...!**

డెహ్రాడూన్‌లో ఉంటున్న సికార్ వాసి రాకేశ్ మందవారియా నుంచి ఈ పేపర్ బయటకు వచ్చింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, అక్కడి నుంచి కేరళలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థికి చేరింది. ఈ ఎంబీబీఎస్ విద్యార్థి రాజస్థాన్‌లోని చురు ప్రాంతానికి చెందినవాడు. కేరళలో చదువుతున్న ఈ రాజస్థాన్ విద్యార్థి దీనిని సికార్ ప్రాంతానికి చెందిన తన స్నేహితులతో మే 1వ తేదీన పంచుకున్నాడు.

తరువాయి 2వ పేజీలో...



# కేసు కొట్టి వేయండి

- మధ్యంతర బెయిల్ ఇవ్వండి
- హైకోర్టులో బండి కుమారుడి పిటిషన్

హైదరాబాద్, మే 11 (ప్రజాకలం) :

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన పోక్సో కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు ఆయన న్యాయపోరాటం మొదలుపెట్టారు.


తరువాయి 2వ పేజీలో...

# కవితకు కోర్టు సమన్లు

-బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌తో కామారెడ్డిలో రైల్ రోకో - కల్వకుంట్ల కవిత పై కేసు నమోదు

-రైల్వే చట్టం కింద 12 మంది టీఆర్ఎస్ నేతలపై కూడా కేసులు

-సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని సమన్లు జారీ



హైదరాబాద్, మే 12 (ప్రజాకలం) :

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన రైల్ రోకో ఆందోళన కేసులో కల్వకుంట్ల కవితకు రైల్వే కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ నెల 28న జరిగిన ఈ ఆందోళన పై నమోదు చేసిన కేసులో విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్‌లోని రెండో జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

తరువాయి 2వ పేజీలో...

# నీట్ లీక్‌పై రాహుల్ ఫైర్

## 22 లక్షల విద్యార్థుల భవిష్యత్తు ధ్వంసమైందని రాహుల్ తీవ్ర విమర్శ



-తల్లిదండ్రుల త్యాగాలు నీటిపాలయ్యాయని భావోద్వేగ వ్యాఖ్యలు

-ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే లీకేజీ అని ఆరోపణ

-పేపర్ మాఫియాకు రాజకీయ రక్షణ ఉందా? అన్న ప్రశ్న

-'అమృత్ కాలం' మాటలకే పరిమితమైందని ఘాటు వ్యాఖ్య


న్యూఢిల్లీ : నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్న నేపథ్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మరింత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది సాధారణ పరిపాలనా లోపం కాదని, దేశ యువత భవిష్యత్తును వ్యవస్థీకృతంగా ధ్వంసం

తరువాయి 2వ పేజీలో...

సైకాలజిస్టుల సేవలు

# అత్యంత కీలకం

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



హైదరాబాద్, మే 12 (ప్రజాకలం) :

ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్యం అత్యంత కీలకమని, ఆ దిశగా నిరంతరం శ్రమిస్తున్న సైకాలజిస్టుల సేవలు అభినందనీయమని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. సైకాలజిస్టులకు వృత్తిపరమైన భరోసా, భద్రత కల్పించేందుకు 'సైకాలజిస్ట్స్ కౌన్సిల్' ఏర్పాటు ఎంతో అవసరమని, ఆ దిశగా తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. హైదరాబాద్లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ క్లబ్ నందు తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "దశాబ్ది ఉత్సవాల అవార్డుల ప్రధానోత్సవం" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# నన్ను కెలికారు..

కన్న పేగును క్షోభ పెడుతున్నారు - నా కుటుంబానికి పెట్టిన నిప్పంటించారు

ఆ నిప్పు వాళ్లనే దహించి వేయబోతోంది - తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు

తప్ప చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే - కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం

కరీంనగర్ "హిందూ ఏక్తా యాత్ర"లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

బండి సంజయ్ హిందూ ధర్మ పరిరక్షకుడు

సంజయ్ కు అండగా నిలవాలంటూ హిందువులకు హంపి పీఠాధిపతి పిలుపు

ఏక్తా యాత్రకు జన ప్రభంజనం- కరీంనగర్ కాషాయ మయం - జన సంద్రమైన కరీంనగర్ వీధులు

కాషాయ శ్రేణుల జోష్...హిందుత్వ వాదుల నినాదాలతో ముందుకు సాగుతున్న ఏక్తా యాత్ర

వినూత్న రీతిలో కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న హిందూ ఏక్తా యాత్ర



కరీంనగర్, మే 12 (ప్రజాకలం) :

"ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. నిజానిజాలు కోర్టులు తేలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం. చట్టానికి కట్టుబడి ఉన్నాలి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. "సమాజమే నా కుటుంబమని భావించి జీవితమంతా సమాజం కోసమే పనిచేసిన. ఏ ఇంట్లో కష్టమొచ్చినా పెద్ద కొడుకునై అండగా ఉన్నా. కానీ కొడుకుకు టైమివ్వలేకపోయా. జరుగుతున్న పరిణామాలకు తప్పు నాదే. క్షమించండి" అని తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేశారు.

తరువాయి 2వ పేజీలో...




జైలు అంటే శిక్ష మాత్రమే కాదు..

# సంస్కరణకు కేంద్రంగా మారాలి

- జైలు అనుభవం కార్యక్రమం


- జైలు మ్యూజియం ప్రారంభోత్సవంలో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్, మే 12 (ప్రజాకలం) :

సమాజ అభ్యున్నతికి శిక్షతో పాటు సంస్కరణ కూడా సమానంగా అవసరమని, జైళ్లు కేవలం శిక్ష విధించే ప్రదేశాలుగా కాకుండా ఆత్మపరిశీలన, వ్యక్తిత్వ వికాసం, కొత్త జీవితానికి నాంది పలికే కేంద్రాలుగా మారాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని చంచల్‌గూడలో రాష్ట్ర కారాగార శిక్షణ సంస్థ లో ఫీల్ ది జైల్ (జైలు అనుభవం)' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫీల్ ది జైల్ సెల్ లను పరిశీలించారు. అనంతరం జైలు మ్యూజియంను ప్రారంభించి నిజాం పాలన కాలంలోని జైలులు , నాగార్జున సాగర్ డ్యాం నిర్మాణంలో ఖైదీల పాత్ర, దాశరథి , రామదాసు లను బంధించిన జైలు నమూనాలు, ఖైదీల్లో మార్పు కోసం తీసుకున్న చర్యలు,

తరువాయి 2వ పేజీలో...

# కలం కౌంటర్



# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి...

కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని,రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు.పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు,ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజూ నివేదికలు పంపించాలని సీఎం ఆదేశించారు.కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు సాధారణ విధానాన్ని విడిచి మిషన్ మోడ్‌లో పని చేయాలని,కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలను జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.రిజాయిండర్లు క్రమం తప్పకుండా మీడియాకు పంపించాలని సూచించారు.తప్పుడు వార్తలను ఎదుర్కోవడంలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు.కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్న పరిస్థితి రావద్దని,రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు.

**90 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం – పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించిందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11 లక్షల 52 వేల టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉందన్నారు.రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ.3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు హమాలీలు,రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు,హమాలీలు,రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

**మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయండి – వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

యాసంగి సీజన్‌లో భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని,రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం,మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.అవసరమైన బందోబస్తు,విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.

**రాష్ట్రంలో ముమ్మరంగా మొక్కజొన్న కొనుగోళ్లు – రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు**

రాష్ట్రంలో పెద్ద ఎత్తున మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు.రాబోయే ఒక నెల అత్యంత కీలకమని,రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగి,ఎకరానికి సగటున 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు.మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రాష్ట్ర మంత్రివర్గం రూ.4,178 కోట్లను ఆమోదించిందని తెలిపారు.ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరగగా,ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ప్రైవేట్ వ్యాపారులు కూడా అధిక ధరలకు మరో 6 లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు.మొత్తం 14 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల నిల్వ అవసరం ఉండగా ఇప్పటికే 10 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు.అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉంచామని,అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా సరఫరాలో కొంత అంతరాయం ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు స్వయంగా గన్నీ సంచులు తీసుకువస్తే డీబీటీ ద్వారా చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు.హమాలీలు,గన్నీ సంచులు,నిల్వ సామర్థ్యం అంశాలపై కలెక్టర్లతో నిరంతర సమన్వయం కొనసాగుతోందని తెలిపారు.హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ.8.50కు పెంచినట్లు చెప్పారు.అవసరమైన రవాణా వాహనాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.ఈ సమావేశంలో డీసీఎస్ఓ శ్రీనాథ్,జిల్లా సహకార అధికారి శ్రీమాల,జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్,డీఆర్‌డీఓ కాళిందిని,జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్,జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ శ్రీకాంత్,ఆర్టీఓ రంగారావు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కవితకు కోర్టు సమన్లు

మొదటి పేజీ తరువాయి...

బీసీ బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలనే డిమాండ్‌తో టీఆర్ఎస్ నేతలు కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన కవితతో పాటు మరో 12 మంది పార్టీ నాయకులపై రైల్వే చట్టం కింద కేసులు నమోదయ్యాయి. రైల్ రోకో కారణంగా రైల్వే రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సిర్నపల్లి--ఇందల్వాయి స్టేషన్ల మధ్య దేవగిరి ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. అలాగే హైదరాబాద్, నిజామాబాద్ మార్గంలో ప్రయాణిస్తున్న గూడ్స్ రైలును కూడా తాత్కాలికంగా ఆపివేశారు. ఈ ఘటనపై కామారెడ్డి రైల్వే ఏఎస్ఐ రవీంద్ర బాబు ఫిర్యాదు చేయగా, ఆ ఫిర్యాదు ఆధారంగా రైల్వే చట్టంలోని 147, 74(ఎ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం కోర్టు విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణలో సంబంధిత నేతల హాజరు, ఆందోళన సమయంలో జరిగిన పరిణామాలపై కోర్టు పరిశీలించనుంది.

## నీట్ రద్దు..

మొదటి పేజీ తరువాయి...

నీట్ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో లీకైనట్లుగా భావిస్తున్న ప్రశ్నలు పోలి ఉండటం అనుమానాలకు తావిస్తోంది.అక్కడి నుంచి ఇది ఒక పేయింగ్ గెస్ట్ వసతి గృహం యజమాని వద్దకు చేరింది. అతడు కూడా దానిని మరికొందరు విద్యార్థులతో పంచుకున్నాడు. వీరంతా ఇతర విద్యార్థులు, కెరీర్ కౌన్సిలర్లతో పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పేపర్ అలా ఒకరి వద్ద నుంచి మరొకరి వద్దకు వాట్సాప్ ద్వారా వ్యాపించింది. ఈ పేపర్‌ను కొంతమంది ప్రింట్ తీసుకుని ఉండి ఉంటారని అనుమానిస్తున్నారు. ప్రింట్ తీసుకుని ఉంటే అలాంటి వారిని గుర్తించడం కష్టమే అవుతుంది.ఈ పేపర్ లీకేజీ గురించి పేయింగ్ గెస్ట్ వసతి గృహం యజమాని ఫిర్యాదు చేశాడు. అయితే పేపర్ లీక్ గురించి అందరికీ తెలియడంతో దాని నుంచి తాను తప్పించుకోవడానికి ఫిర్యాదు చేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ పేపర్ లీక్‌కు సంబంధించి పూర్తి ఆధారాలు, అలాగే ఇది ఎక్కడి నుంచి వచ్చిందనే విషయాలు వెల్లడి కావాల్సి ఉందని జైపూర్ పోలీసు అధికారులు చెబుతున్నారు.ఎస్ఓజీ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ విశాల్ బన్సల్ మీడియాతో మాట్లాడుతూ, ఆ పేపర్‌లో 400కు పైగా ప్రశ్నలు ఉన్నాయని, వాటిలో సుమారు 120 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చినట్లు చెప్పారు. లీకైనట్లుగా భావిస్తున్న పేపర్ నీట్ పరీక్షకు కొన్ని వారాల ముందే విద్యార్థుల వద్ద ఉందని అన్నారు.ఈ ప్రశ్నాపత్రం ఎక్కడి నుంచి లీకైందనే విషయం వెల్లడి కాలేదని తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల మొబైల్ ఫోన్‌లలోని వాట్సాప్‌లో కనిపించినట్లు చెప్పారు. ఈ పేపర్ లీకేజీ ఆరోపణలకు సంబంధించి ఇప్పటి వరకు 20 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో విద్యార్థులు, కెరీర్ కౌన్సిలర్లు ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకు మరోసారి పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎన్టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులను విడుదల చేస్తామని తెలిపింది.

## నీట్ లీక్‌పై రాహుల్ ఫైర్

మొదటి పేజీ తరువాయి...

చేసిన ఘోర వైఫల్యమని ఆయన మండిపడ్డారు. దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి, సంవత్సరాల తరబడి శ్రమించి పరీక్షకు సిద్ధమయ్యారని గుర్తు చేసిన రాహుల్ గాంధీ, ఆ కష్టాన్ని ఒక లీకేజీ ఘటనతోనే నాశనం చేయడం దేశానికి అవమానకరమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల కలలను, వారి కుటుంబాల ఆశలను బీజేపీ నేతృత్వంలోని పాలనా వ్యవస్థ నిర్దాక్షిణ్యంగా చిదిమేసిందని ఆయన ఆరోపించారు. పిల్లల చదువుల కోసం అనేక కుటుంబాలు అప్పులు చేశాయని, మరికొందరు తల్లిదండ్రులు తమ బంగారం అమ్మి, ఆర్థిక ఇబ్బందుల్లోనూ చదువులు కొనసాగించారని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. అలాంటి త్యాగాలన్నీ ఒక్క వ్యవస్థ వైఫల్యంతోనే వ్యర్థమైపోవడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం పరీక్షా వ్యవస్థ లోపం కాదని, దేశ విద్యా వ్యవస్థలో పాతుకుపోయిన అవినీతి, నిర్లక్ష్యం, సమన్వయ లోపాల కలయిక వల్ల జరిగిన నేరమని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రతి సారి పేపర్ లీక్ మాఫియా నిర్భయంగా బయటపడుతుంటే, విద్యార్థులు మాత్రం మానసికంగా, ఆర్థికంగా నలిగిపోతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ మాఫియాకు రాజకీయ అండదండలు ఉన్నాయా అన్న అనుమానం ప్రజల్లో బలపడుతోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ఇలాంటి ఘటనల మధ్య ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన 'అమృత్ కాలం' నినాదం వాస్తవానికి పూర్తిగా విరుద్ధంగా మారిందని, ఇది యువతకు ఆశాకిరణం కాకుండా అనిశ్చితి, ఆవేదన, నిరాశల కాలంగా మారుతోందని రాహుల్ గాంధీ ఘాటుగా విమర్శించారు.

## సైకాలజిస్టుల సేవలు అత్యంత కీలకం

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెచ్చరిల్లుతున్న విపరీత ధోరణులకు మానసిక ఆరోగ్యం లోపించడమే ప్రధాన కారణమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒత్తిడిని జయించడానికి ప్రతి ఒక్కరూ యోగా, ప్రాణాయామం వంటివి అలవరచుకోవాలని సూచించారుమాజీ జాతీయ మహిళా కమిషన్ త్రిపురాణ వెంకటరత్నంసలహాదారు సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కౌన్సిలింగ్ ఒక పదునైన ఆయుధంలా పనిచేస్తుందని, వేధింపులకు గురైన మహిళల్లో మనోధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత సైకాలజిస్టులపై ఉందని పేర్కొన్నారు.గౌరవ అతిధు లు ప్రముఖ నిర్మాత ఉ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ౦ఖం పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం అభినందనీయమని అన్నారు. సమాజంలో జరుగుతున్న అకృత్యాలు, ఆత్మహత్యలను నివారించడంలో సైకాలజిస్టుల పాత్ర వెలకట్టలేనిదని తెలిపారు. టుంబాలలో తలెత్తే వివాదాలు విడాకులకు దారి తీస్తున్నాయని, డిప్రెషన్కు గురవుతున్న వారికి సరైన సమయంలో కౌన్సిలింగ్ అందించి వారిని కాపాడాలని కోరారు. మానసిక వైకల్యం లేని సమాజాన్ని నిర్మించి, యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపాల్సిన గురుతర బాధ్యత సైకాలజిస్టులపై ఉందని అన్నారు. డా. వోతుకూరి రాంచందర్ (౦ఖం రాష్ట్ర అధ్యక్షులు): అసోసియేషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సమాజంలో మానసిక సమస్యల పరిష్కారానికి మే 5 నుండి 15 వరకు వివిధ మానసిక ఆరోగ్య సదస్సులు మరిన్ని ఉచిత కౌన్సిలింగ్ సేవలు మరియు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తామని ప్రకటించారు. అవార్డుల ప్రధానం: ఈ వేడుకల్లో భాగంగా విశేష సేవలు అందించిన వారికి 14 మందికి: 'వుమెన్ ఐకాన్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైకాలజీ అవార్డ్', 08 మందికి: 'మైండ్ అండ్ మెరిట్ అవార్డ్'20 మందికి: 'డికేడ్ ఆఫ్ సర్వీస్ అవార్డ్' కింది అవార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్టు డా. హరిణి, వి.వి.ఎన్. వసుంధర, డా. పూర్ణిమ నాగరాజ మరియు సంఘ నాయకులు శ్రీపూజ, సుధాకర్, కృష్ణసాహితి, బి. నారాయణ రావు, సునయన, రాజు ఆచార్య, దేదీప్య, వశిష్ఠ, విశాల శ్రీకాంత్ మజ్జిగ తదితరులు పాల్గొన్నారు.

## కేసు కొట్టి వేయండి – హైకోర్టులో బండి కుమారుడి పిటిషన్

మొదటి పేజీ తరువాయి...

ఈ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భగీరథ్ సోమవారం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు వేసవి సెలవులు నడుస్తుండటంతో, భగీరథ్ తరపు న్యాయవాదులు అత్యవసరంగా వెకేషన్ బెంచ్ ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం, దీనిపై విచారణను మే 14 గురువారం కు వాయిదా వేసింది. ఆ రోజున వెకేషన్ బెంచ్ ఇచ్చే ఉత్తర్వులపై భగీరథ్ అరెస్ట ఉంటుందా లేదా అన్నది తేలనుంది.సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో 17 ఏళ్ల మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భగీరథ్‌పై మే 8న పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. గత ఏడాది డిసెంబర్‌లో మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో ఈ వేధింపులు జరిగినట్లు బాధితురాలి కుటుంబం ఆరోపించింది. కాగా, ఈ కేసు నమోదు కావడానికి కొద్ది గంటల ముందే భగీరథ్ కరీంనగర్‌లో సదరు బాలిక కుటుంబంపై హనీట్రాప్, బ్లాక్ మెయిల్ ఆరోపణలతో ఎదురు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కేసు విచారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో విచారణ ముమ్మరంగా సాగుతోంది. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం అందుతున్న తరుణంలో, హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. పోక్సో కేసులో నిబంధనలు అత్యంత కఠినంగా ఉండటంతో, హైకోర్టు మధ్యంతర ఉపశమనం కల్పిస్తుందా? లేదా? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## నన్ను కెలికారు..

మొదటి పేజీ తరువాయి...

జీవితాంతం నా బాటలోనే నడిచిన నా భార్య కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా చేతనైనంత సాయం చేసిందని, ఈరోజు కన్న పేగునే క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను భయపడేది లేదని స్పష్టం చేసిన బండి సంజయ్ "నన్ను కెలికారు. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహించి వేస్తా. అవినీతి గడీలను బద్దలు కొడతా"అని అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం కరీంనగర్ లోని వైశ్యాభవన్ నుండి "హిందూ ఏక్తా యాత్ర" ప్రారంభమైంది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ఏక్తా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలాది మంది ఈ యాత్రకు తరలివచ్చారు. వేలాది మంది కాషాయ శ్రేణులతో కరీంనగర్ జన సంద్రమైంది. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బండి సంజయ్ ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ఈ లైట్ల ఫోకస్ ఎక్కువైంది. నేను మాట్లాడుతుంటే లైట్ల కాంతికి కళ్లల్లో నీళ్లు వస్తే ఏడుస్తున్నానని అనుకునేరు. నేను భయపడ. బండి సంజయ్ కంట తడి పెట్టే రకంకాదు. టవర్ సర్కిల్ పై కాషాయ జెండాను ఎగరేశాం. కరీంనగర్ ప్రజలకు హ్యాట్సాఫ్. హిందువుల ఐక్యతను చాటేందుకే 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర చేస్తున్నా. జై శ్రీరాం అనే నినాదమే హిందూ ధర్మాన్ని కాపాడుతుంది. హిందూ సమాజానికి ఆపదొస్తే జై శ్రీరాం నినాదంతో తెగించి కొట్లాడతాం.

కరీంనగర్ గడ్డ రక్తం నాలో ప్రవహిస్తుంది. కరీంనగర్ లో గల్లీగల్లీలో ప్రజా సమస్యలపై కొట్లాడిన. చిన్న కార్యకర్తగా మొదలైంది నా ప్రస్తానం. నా జీవితం కష్టాలు, బాధలే. బాధలను చూసి భయపడి పారిపోయేటోడ్ని కాను.

మీరే నా కుటుంబం. సమాజమే నా ఇల్లు అనుకున్న. హార్ట్ లో స్టంట్ ఉన్నా హార్ట్ ఫుల్ గా 1600 కి.మీలు నడిచిన. తెలంగాణ ప్రజల కష్టాలను పంచుకున్న. నాటి పాలకులు నాపై రాళ్ల దాడి చేసినా, 109 కేసులు పెట్టి జైలుకు పంపినా భయపడలే. ఏ హిందువుకు ఆపదొచ్చినా అండగా ఉన్నా. మీ ఇంట్లో పెద్ద కొడుకునైన. నా టైమంతా సమాజానికే ఇచ్చిన. నా కొడుకుకు టైమియ్యలేకపోయిన. నా కొడుకును క్రిమినల్ గా చూపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. అయినా నా కొడుకును నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు.నా భార్య సైతం నన్ను ఫాలో అవుతోంది. నేనున్నా లేకున్నా కార్యకర్తలకు చేతనైనంత సాయం చేస్తోంది. ఈరోజు నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతి వ్యవస్థను దగ్ధం చేస్తా. అవినీతి, కుట్రలు చేసే గడీల బద్దలు కొడతా. నన్ను, నా కుటుంబాన్ని, నా కార్యకర్తలను ఇబ్బంది పెట్టినోడిని విడిచి పెట్టే ప్రసక్తే లేదు.

బండి సంజయ్ భయపడే ప్రసక్తే లేదు. కాషాయ జెండా పట్టి కష్టాలు పడుతూనే ఉన్నా. అయినా బాధపడను..ధర్మం కోసం పోరాడుతూనే ఉన్నా. నా కొడుకుకు టైమివ్వకుండా నేను తప్పు చేసిన. తప్పు నాదే.... నన్ను క్షమించండి. తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు... నిరూపించుకోవాలని చెప్పిన. నా చివరి శ్వాస వరకు హిందూ ధర్మం కోసమే పనిచేస్తా. ఇయాళ నా కొడుకుపై జరుగుతున్న దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.

నా కొడుకు సంఘటన మమ్ముల్ని ఇబ్బంది పెడుతుంటే... 29 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటుంటే ఆ కుటుంబాలు పడుతున్న క్షోభ గుర్తుకొస్తోంది. శ్రీరామ చంద్రుడికే కష్టాలు తప్పలేదు. శ్రీరామచంద్రుడే నాకు ఆదర్శం. కష్టాలు భరిస్తా. ఆనాడు రాక్షసులు ఆంజనేయస్వామికి నిప్పంటిస్తే ఏమైంది? లంకా దహనమైంది. నేను హనుమంతుడి భక్తుడిని. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతికి పాల్పడుతూ కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహనం చేస్తా. అవినీతి గడీలను కూల్చివేస్తా. వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

## జైలు అంటే శిక్ష మాత్రమే కాదు..
# సంస్కరణకు కేంద్రంగా మారాలి

మొదటి పేజీ తరువాయి...

జైలు ఉత్పత్తులు, జైలు కార్యకలాపాలు, అచీవ్ మెంట్ లను గవర్నర్ పరిశీలించారు.

అనంతరం గవర్నర్ విక్రయానికి ఉంచిన జైలు ఉత్పత్తులను పరిశీలించారు.అనంతరం వాల్మీకి పేరుతోఖైదీల్లో సత్ప్రవర్తనకు తీసుకుంటున్న చర్యల వివరించే డాక్యుమెంటరీ నీ గవర్నర్ తిలకించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, 'జైలు మ్యూజియం' ప్రారంభం కేవలం ఒక భవనం ప్రారంభోత్సవం కాదని, న్యాయం--సంస్కరణల దిశగా ముందుకు తీసుకెళ్తున్న ఒక కీలక అడుగని అన్నారు. ఈ మ్యూజియంలో ప్రదర్శించిన పాత సంకెళ్లు, జైలు గదులు గతంలోని కఠిన కారాగార వ్యవస్థను గుర్తుచేస్తే, ఖైదీల నైపుణ్యాభివృద్ధి, కారాగార పరిశ్రమల ద్వారా రూపొందిన ఉత్పత్తులు వంటి కార్యక్రమాలు 'ప్రతీకారం నుంచి పరివర్తన' వైపు తీసుకెళ్తున్న మార్పుకు నిదర్శనంగా నిలిచాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రగతిశీల సమాజం అంటే తప్పు చేసిన వారిలో మార్పు తీసుకురావడానికి ఎంత సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందన్న దానిపైనే ఆధారపడి ఉంటుందని గవర్నర్ అన్నారు. ఖైదీల పునరావాసం సమాజం యొక్క నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. తాను గతంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రిజన్ మంత్రిగా పనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గవర్నర్ గుర్తు చేశారు.

తెలంగాణ కారాగార శాఖ శిక్షతో పాటు పునర్నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు.

'ఫీల్ ది జైల్' కార్యక్రమాన్ని వినూత్న విద్యా కార్యక్రమంగా అభివర్ణించిన గవర్నర్, ముఖ్యంగా యువతలో చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, పౌర బాధ్యతను పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. స్వేచ్ఛ ఎంత అమూల్యమైనదో, చట్టాన్ని పాటించడం



సమాజానికి ఎలా మేలు చేస్తుందో ఈ కార్యక్రమం ప్రజలకు గుర్తుచేస్తుందన్నారు.ఈ వినూత్న ఆలోచనను కార్యరూపం దాల్చించిన తెలంగాణ రాష్ట్ర ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ శాఖ డైరెక్టర్ జనరల్ హోడాక్టర్ సౌమ్య మిశ్రా , అధికారులను గవర్నర్ ఈ వేదికగా అభినందించారు. ఈ జైల్ మ్యూజియం భవిష్యత్తులో పర్యాటక ఆకర్షణగా మాత్రమే కాకుండా విద్య, పరిశోధన, సామాజిక చైతన్యానికి ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ హోడాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ...రాష్ట్ర ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ శాఖ లో ఈ కార్యక్రమాలను ప్రారంభించుకోవడం కొత్త అధ్యాయం అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రిజన్స్ ఐ జి ఎన్ మురళి బాబు, డి ఐ జి లు డా డి శ్రీనివాస్, ఏం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ

- శానబండ గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్ ఆధ్వర్యంలో



ఎండపల్లి, మే 12 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం శానబండ గ్రామం లో మంగళవారం రోజున ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ పాకెట్ల ను గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్ ఓ ఆర్ ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ రజిత, వార్డ్ సభ్యులు గాధం శ్రవణ్, ఆశా వర్కర్ విజయ, కార్యదర్శి మారుతీ, సీనియర్ మెట్ తేజ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్ తెలిపారు.

# పేదింటి క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందించిన ఉపసర్పంచ్

వెల్గటూర్, మే 12 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన పేదింటి క్రీడాకారుడు బంద్ర అజయ్ సబ్ జూనియర్ బేస్ బాల్ బాలుర రాష్ట్ర స్థాయి క్యాంపు కు




తెలంగాణ మోడల్ స్కూల్ నుండి ఎంపికయ్యాడు. విద్యార్థి పోటీల్లో పాల్గొనేందుకు పేదరికం అడ్డుపడు తుందని తెలుసుకున్న ఉప సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు గంద్ర ప్రతాప్ రావు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం రోజున పాఠశాల లో విద్యార్థి కి 2000 రూపాయలు నగదు ను అందజేశారు. రాష్ట్ర స్థాయి బేస్ బాల్ కు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ మేరుగు మురళి గౌడ్, ప్రిన్సిపాల్ క్రిష్ణ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ గంద్ర శ్రీకాంత్ రావు, వార్డు సభ్యులు గుండాటి సందీప్ రెడ్డి, నక్క సురేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూపాక ప్రవీణ్, వెల గందుల సంతోష్, బొడ్డు సంతోష్, పీఈటి కొప్పుల గంగాధర్, జక్కుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధి లో రౌడీ షీటర్ రిమాండ్

ధర్మపురి, మే 12 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధి లో తేదీ 08.05.2026 శుక్రవారం రోజున రాత్రి 8:00 గంటల కు జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరెళ్ల గ్రామానికి చెందిన సంబేట నర్సయ్య అనే వ్యక్తి మరియు అతని భార్య సంబెట లక్ష్మి అను ఆమె తన బర్రెలకు మేత వేయడానికి పోతుండగా అదే గ్రామానికి చెందిన తోకల గంగాధర్ వయస్సు (38) సంవత్సరాల అనే వ్యక్తి ఆమెను అడ్డుకొని ఆమె ఆగక పోతే ఆమెను వెంబడిస్తూ బీరు సీసా పట్టుకొని బెదిరించగా ఆమె భర్త అయినా సంబేట నర్సయ్య మధ్యలో వెళ్లి ఆమెను అక్కడ నుంచి తీసుకువెళ్లినాడు. తర్వాత రాత్రి 10:30 గంటలకు తోకల గంగాధర్ మరియు అతని తోకల లక్ష్మి లు కలిసి సంబెట నర్సయ్య ,లక్ష్మిలను చంపాలని ఉద్దేశంతో అక్రమంగా వారి పాత ఇంటి వద్దకు వెళ్లి గడ్డపార తో తలుపులు పగలగొట్టడానికి ప్రయత్నం చేసి అక్కడ నర్సయ్య లక్ష్మి లేకపోవడం తో వారి ఇంట్లో ఉన్న కరెంటు మోటార్, మోటార్ స్టాటర్ ఇతర వస్తువులను ధ్వంసం చేసినారు. ఇట్టి విషయం పై సంబేట నర్సయ్య ధర్మపురి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడం జరిగినది. అందుకుగాను నిందితుడిని ధర్మపురి ఫస్ట్ క్లాస్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడం జరిగినది. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని జగిత్యాల జైలుకు తరలించడం జరిగినది. గంగాధర్ ఇదివరకు చాలా ప్రదేశాల లో పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడని ధర్మపురి ఎస్సై జి మహేష్ తెలిపారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలి

- ఎన్ ఎస్ యూ ఐ వైస్ ప్రెసిడెంట్ సమీర్ సర్కార్





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 12 (ప్రజా కలం) హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని ఎన్ ఎస్ యూ ఐ వైస్ ప్రెసిడెంట్ సమీర్ సర్కార్ పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్ స్టాండ్ లో మెట్‌పల్లి పట్టణం వైస్ ప్రెసిడెంట్ సమీర్ సర్కార్ అధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ పిలుపు మేరకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సమీర్ సర్కార్ మాట్లాడుతూ మహిళలు, బలికలు అన్యాయం ఆభద్రత ఎదురుకుంటున్న తరుణంలో బేటీ బచావో- బేటీ పడవో కేవలం నినాదంగా మారకూడదని అన్నారు. నైతిక బాధ్యత వహించి కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే రాజీనామ చేయలాని డిమాండ్ చేశారు. సాధరణ వ్యక్తిగా కేసు పరిష్కారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యూ ఐ మెట్‌పల్లి మండల అధ్యక్షుడు అల్లోత్ సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి సాయి, శివ, ఉమర్, కొండల్, అభి ఉన్నారు.

# మైనర్ బాలికపై అఘాయిత్యం హేయమైన చర్య

- కేంద్ర మంత్రి కుమారుడిని తక్షణమే అరెస్ట్ చేయాలి
- బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష

పెద్దపల్లి,మే 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఒక 17 ఏళ్ల మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసరి ఉష మాట్లాడుతూ ఒక తండ్రిగా తన కుమారుడిని క్రమశిక్షణతో పెంచడంలో బండి సంజయ్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.గత కొన్ని నెలలుగా ఆ బాలికను వేధింపులకు గురిచేస్తున్నా, నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో కేసు నమోదు చేయడానికి పోలీసులకు మూడు రోజులు పట్టడం సిగ్గుచేటన్నారు.పోక్సో కేసు నమోదైనప్పటికీ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని,చట్టం ఎవరికైనా ఒక్కటేనని ఆమె స్పష్టం చేశారు.బాధితురాలి తల్లిదండ్రులను పిలిపించి భయభ్రాంతులకు గురిచేస్తూ,కేసు వెనక్కి తీసుకోవాలని బండి సంజయ్ బెదిరింపులకు పాల్పడటం ఆయన అధికార గర్వానికి నిదర్శనమని ఉష




ఆరోపించారు.నిందితుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్న బండి సంజయ్‌ను కూడా ఈ కేసులో నిందితుడిగా చేర్చాలని, విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకుని,నేరస్తుడు ఎంతటి వారైనా వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.బీజేపీ సే బేటీ బచావో అనే పరిస్థితి నేడు దేశంలో నెలకొందని,తెలంగాణ ఆడబిడ్డలకు రక్షణ కల్పించే వరకు తమ పోరాటం ఆగేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మహిళ కన్వీనర్ సిరవేణ స్వప్న,రామిళ్ళ శారద,, అరుణ,శారద,రాజమ్మ,మొలుమూరి శేఖర్,అబ్దుల్ మాలిక్,భూమయ్య,తదితరులు పాల్గొన్నారు

# పర్యాటక రంగానికి గౌరి గుండాల మణిహారం

- కాలుష్య నిర్మూలనకు ప్లాస్టిక్ ప్రాసెసింగ్ యూనిట్
- జలపాతానికి రూ. 6 కోట్లు,ప్లాస్టిక్ యూనిట్‌కు రూ. 43 లక్షలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి,మే12;(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి నియోజకవర్గాన్ని పర్యాటక రంగంలో మేటిగా తీర్చిదిద్దడమే కాకుండా,కాలుష్య రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు.మంగళవారం ఆయన నియోజకవర్గంలో పర్యటించి రెండు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.ముందుగా పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలోని గౌరి గుండాల-సబ్బితం జలపాతం వద్ద రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి పనులకు అధికారులతో కలిసి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ జలపాతం పర్యాటకులకు అద్భుతమైన అనుభూతినిస్తుందని,గత పాలకులు దీని అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంత రూపురేఖలు మార్చేందుకు భారీగా నిధులు కేటాయించామని,పర్యాటకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం గౌరెడ్డిపేట గ్రామంలో రూ.43 లక్షల నిధులతో నిర్మించనున్న ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్‌మెంట్ యూనిట్ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్లాస్టిక్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజలను అప్రమత్తం చేశారు.ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని,ఈ యూనిట్ ద్వారా గ్రామాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ముడి సరుకుగా మారుస్తామని తెలిపారు.తద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా,గ్రామాల్లో పరిశుభ్రత పెరుగుతుందన్నారు.ఈ యూనిట్ నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నుగుల్లా మల్లయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి,తహసీల్దార్,పర్యాటక శాఖ అధికారులు,స్థానిక సర్పంచులు కొమ్ము సుజాత,నూనె సరోజన,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శిపై డీఎల్పీఓ విచారణ

జూలపల్లి,మే12:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జూలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనంతుల లచ్చయ్యపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి మంగళవారం విచారణ నిర్వహించారు. అక్రమ కట్టడాల విషయంలో కార్యదర్శి వ్యవహరించిన తీరుపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉపసర్పంచ్ కొప్పుల మహేష్ ఫిబ్రవరి 28న జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ జరిగింది.ఈ సందర్భంగా మహేష్ తన వాదనలను వినిపిస్తూ..కార్యదర్శి లచ్చయ్య గత 20 ఏళ్లుగా ఇదే మండలంలో విధుల్లో ఉన్నారని,అందులో సుమారు 14 ఏళ్లుగా జూలపల్లిలోనే కొనసాగుతూ అక్రమ కట్టడాలకు ప్రోత్సాహం కల్పిస్తున్నారని ఆరోపించారు.నివాస గృహాల పేరుతో అనుమతులు తీసుకుని వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నా,రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా కార్యదర్శి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని డీఎల్పీఓ దృష్టికి తీసుకెళ్లారు. అంతే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా కార్యదర్శి స్థానికంగా ఉండకుండా కరీంనగర్ నుండి విధులకు హాజరవుతున్నారని పేర్కొన్నారు.విచారణలో భాగంగా డీఎల్పీఓ దేవకిదేవి క్షేత్రస్థా



యిలో ఫిర్యాదు అందిన పలు స్థలాలను స్వయంగా పరిశీలించారు.రోడ్లపైకి వచ్చిన నిర్మాణాలను చూసి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ,నిబంధనలు అతిక్రమించి రోడ్లపైకి వస్తున్న నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారు,పనులను ఎందుకు నిలిపివేయలేదు,బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు అని నిలదీశారు. అక్రమ కట్టడాలను అరికట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్ ఈ సందర్భంగా డీఎల్పీఓను కోరారు.ఈ విచారణ కార్యక్రమంలో ఎంపీఓ శేషయ్య సూరి,సర్పంచ్ పాఠకుల అనూష,మామిడిశెట్టి శ్రీనివాస్,అంకుస్,పాఠకుల జ్యోష్న,మల్లెత్తుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ గళం.. శంకరుడికే పట్టం

- టీఎన్జీఓ జిల్లా అధ్యక్షునిగా బొంకూరి శంకర్ వరుసగా నాలుగవసారి ఏకగ్రీవం

పెద్దపల్లి,మే12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షునిగా బొంకూరి శంకర్ వరుసగా నాలుగవసారి ఏకగ్రీవంగా ఎన్నికై సరికొత్త రికార్డు సృష్టించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ కల్యాణ మండపంలో ఎన్నికల అధికారులు డి.శ్రీనివాస్, రవికుమార్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరూ శంకర్ నాయకత్వంపై



సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా ఆయిరెడ్డి సందీప్ రెడ్డి,అసోసియేట్ అధ్యక్షురాలిగా గోపు అనిత,కోశాధికారిగా ఎడ్ల కొమురయ్యతో పాటు ఉపాధ్యక్షులుగా ఏ.శ్రీనివాస్,ఎస్.మహేందర్ రెడ్డి,వి.శ్రీనివాస్, కె స్వప్న కుమారి,సంయుక్త కార్యదర్శులుగా ఈ.ప్రవీణ్, ఎం.శ్రీధర్,బి.రమేష్,పి.సౌమ్య, పబ్లిసిటీ కార్యదర్శిగా డి.నిశాంత్ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.అంజయ్య,ఈసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.2017లో జిల్లా ఏర్పడిన నాటి నుండి నేటి వరకు తిరుగులేని నాయకుడిగా ఎదిగిన బొంకూరి శంకర్,గెజిటెడ్ అధికారుల నుండి నాలు గో తరగతి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరి సమస్యపై స్పందిస్తూ, పీఆర్సీ,పదోన్నతు లు, ఉద్యోగ భద్రత వంటి అంశాల్లో రాజీలేని పోరాటం చేస్తూ అందరివాడు గా గుర్తింపు పొందారు. నూతనంగా ఎన్నికైన నాయకులను జిల్లా అధికారులు ప్రభాకర్,రాజశేఖర్ ఘనంగా సన్మానించగా, ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నాలుగవసారి బాధ్యతలు అప్పగించిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల టీఎన్జీఓ ప్రతినిధులు,జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

- మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు అతడిని జగిత్యాల సబ్ జైలుకు తరలించిన పోలీసులు




ధర్మపురి, మే 12 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా అట్టి తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష ను విధించారు వివరాల్లోకి వెళితే పెద్దపల్లి జిల్లా గోపాలరావుపేట గ్రామానికి చెందిన శనిగారపు రాకేష్ వయస్సు (28) సంవత్సరాల అను వ్యక్తికి రెండు రోజుల క్రితం ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల లో పట్టుబడ్డాడు. అతడికి పరీక్షలు నిర్వహించగా అట్టి పరీక్షల లో అతడు నిర్దేశించిన మోతాదు కంటే మించి, 200 మిల్లి గ్రాముల ఆల్కహాల్ సేవించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ధర్మపురి పోలీసులు అతడిని ధర్మపురి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా మెజిస్ట్రేట్ అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు అతడిని జగిత్యాల జిల్లా సబ్ జైలుకు తరలించడం జరిగిందని ధర్మపురి ఎస్సై జి మహేష్ తెలిపారు.

# గుల్లకోట బస్టాండ్ దగ్గర చలివేంద్రం ప్రారంభం

- చలివేంద్రాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్




ఎండపల్లి, మే 12 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో మంగళవారం రోజున వేసవి కాలం ఉన్నందున ప్రయాణికుల కు ఉచిత నీరు అందించేందుకు గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ చలివేంద్రం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమం లో అరిగేల రవి, బట్టు తిరుపతి, బుర్ర నాగరాజు, మేర జలంధర్, రాజయ్య, పర్సయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ తెలిపారు.

# బండలింగపూర్ రైతు వేదికలో శాస్త్రవేత్తల అవగాహన సదస్సు

మెట్ పల్లి రూరల్, మే 12:( ప్రజా కలం):

వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, అధునాతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు జగిత్యాల జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మే 13న (బుధవారం) ఉదయం 8:30 గంటలకు మండలం లోని బండలింగాపూర్ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమంలో పొలాస వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పలు అంశాలపై మార్గదర్శకత్వం చేస్తారు భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా సన్న రకాల వరి సాగు పద్ధతులు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపు, ఉద్యాన పంటల లాభాలు, శాస్త్రవేత్తలతో నేరుగా ముఖాముఖి చర్చించి సందేహాలను తీర్చుకునే అవకాశం. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని లాభసాటి వ్యవసాయం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. కావున ప్రజా ప్రతినిధులు, రైతులు, పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జగిత్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

# ఒంటరి యువతిపై అఘాయిత్యం

- నేరస్తుడికి పదేళ్ల జైలు..రూ.7వేల జరిమానా

పెద్దపల్లి,మే12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం జరిగిన యువతిపై అత్యాచార ఘటనలో నేరస్తుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ.7వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె. సునీత మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించారు.జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ కేసులో పోలీసులు శాస్త్రీయ ఆధారాలతో నేరాన్ని నిరూపించి నిందితుడికి శిక్ష పడేలా చేశారు.పోలీసుల కథనం ప్రకారం..పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన మాచర్ల అలియాస్ రాచర్ల రాయమల్లు (62) అనే వ్యక్తి,2024 ఏప్రిల్ 23న తన వక్రబుద్ధిని ప్రదర్శించాడు. బాధితురాలి తల్లి ఉపాధి హామీ పనులకు వెళ్లిన సమయం చూసి, ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఉదయం 9 గంటల సమయంలో ఇంటి వద్ద కూర్చున్న యువతిని బలవంతంగా లోపలికి లాక్కెళ్లి ఆమెపై అత్యాచారం చేయడమే కాకుండా,ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తానని బెదిరించి పరారయ్యాడు.బాధితురాలు ధైర్యంగా తన తల్లికి జరిగిన విషయాన్ని వివరించగా, కుటుంబ సభ్యులు పోత్కపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.నాటి పోత్కపల్లి ఎస్ఐ జి.అశోక్ రెడ్డి కేసు నమోదు చేయగా,సీఐ జి.సుబ్బారెడ్డి శాస్త్రీయ కోణంలో దర్యాప్తు నిర్వహించారు.నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడమే కాకుండా,పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ సాక్షులను సమర్థవంతంగా ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించారు.సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి,రాయమల్లును దోషిగా నిర్ధారిస్తూ పదేళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు.నేరస్తుడికి శిక్ష పడేలా శ్రమించిన పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి,ఏసీపీ జి.కృష్ణ,సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, పోత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్,కోర్ట్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, హెచ్‌సీ రాజుయాదవ్,సీఎంఎస్ కోటేశ్వరరావులను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారెవరినీ వదిలిపెట్టబోమని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.



ప్రజా కలం

బుధవారం, మే 13, 2026

### నియోజకవర్గాల పెంపు

## ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

ఉమ్మడి ఏపీలో 2014 వరకు 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 42 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 175 స్థానాలు.. తెలంగాణకు 119 స్థానాలు వెళ్లాయి. అదే సమయంలో లోక్ సభ స్థానాల అంశాన్నే తీసుకుంటే.. ఏపీకి 25 స్థానాలు.. తెలంగాణకు 17 స్థానాలు కేటాయించారు. విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచుతామని చెప్పారు. ఈ లెక్కన ఏపీ అసెంబ్లీలో ఉన్న 175 స్థానాలకు 225 స్థానాలు పెరగాలి. తెలంగాణలో.. ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు 150కు పెరుగుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఏపీ రాష్ట్ర వాటా 4.08 శాతం. ఆ నిష్పత్తి ప్రకారం ఏపీకి వచ్చే లోక్ సభ స్థానాలు 33 మాత్రమే.తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కడ పెరుగుతాయి..? తగ్గే సీట్లు ఎక్కడ తగ్గుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద నగరాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో తగ్గొచ్చనేది అంచనా. అలా జరిగితే.. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే తెలంగాణ జనాభా 3.60 కోట్లు కాగా.. జీహెచ్ఎంసీ జనాభానే కోటి పైగా ఉంది. కాబట్టి ఇక్కడ సీట్లు పెంచక తప్పదు. గతంలో పునర్విభజన జరిగినప్పుడు కూడా హైదరాబాద్‌లో సీట్లు పెరిగిన సంగతిని సీనియర్లు గుర్తుచేసుకుంటున్నారు..ఏతావాతా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నగర ప్రాంతాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గుతాయనేది ప్రముఖంగా వినిపిస్తున్న మాట. అలా జరిగితే అర్బన్ ప్రాంతాల్లో పట్టున్న పార్టీలకు, నేతలకు అడ్వాంటేజ్ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. తద్వారా గ్రామీణ ఓటర్ల కంటే అర్బన్ ఓటర్లను ఆకట్టుకోవటానికి పార్టీలు, నేతలు ఎక్కువ ప్రయత్నాలు చేస్తారనడంలో సందేహం అక్కర్లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పార్టీలన్నీ తమ బలాబలాలు, ట్రాక్ రికార్డ్, ఓట్ల శాతం, పట్టున్న ప్రాంతాల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. దాన్ని బట్టి భవిష్యత్ రాజకీయ వ్యూహం ఖరారు చేసుకునే పనిలో పడొచ్చని నేతలు భావిస్తున్నారు. పార్టీలకు మాత్రం స్వతహాగా మహిళల్లో అనుకూలత లేదు. కొన్నింటికైతే తమ తప్పు లేకుండానే ప్రత్యర్థుల చాతుర్యం కారణంగా మహిళా వ్యతిరేకులనే ముద్ర పడిపోయింది. ఇప్పటికిప్పుడు ఆ ముద్ర చెరిపేసుకోవడం కుదురుతుందా అనేది కొత్త టెన్షన్. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్లు అమలు కాకుండానే.. ఎన్నికల్లో గెలుపోటములకు మహిళా ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో నారీశక్తి ఘనంగా పనిచేసింది.2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల ఆధారంగా లోక్‌సభ స్థానాలను పునర్విభజించాలన్న నిబంధన పెట్టారు. ఈ లెక్కన ముందు అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 27,41,239 మంది జనాభా ఉన్నారు. ప్రాథమికంగా అందుతున్న సమాచారం, జరుగుతున్న ప్రచారం మేరకు ప్రతి 2లక్షల జనాభాకు ఒక సీటు పెరిగే అవకాశం ఉంది. ఇక లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26 లేదా 27 అయ్యే అవకాశాలున్నాయి. జనాభా లెక్కల ఆధారంగా ఏర్పాటు చేస్తే అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువ ఎంపీ సీట్లు పెరుగుతాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ స్థానాలు, పునర్విభజన అనంతరం 14 లేదా 15 అయ్యే అకాశాలున్నాయి. వీటిలో 33 శాతం కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 5 స్థానాలు మహిళలకు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ స్థానాలను కలుపుకొనే మహిళల రిజర్వేషన్ కల్పిస్తారు. అంటే రిజర్వేషన్ పురుషులు, మహిళలు అని మారుతూ ఉంటుంది. దీంతో రాజకీయంగా కొత్త వారికి అవకాశాలు వస్తాయి. పురుషులతోపాటు మహిళలు అవకాశాలు అందిపుచ్చుకొనే వీలు ఉంటుంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వచ్చే ఎన్నికల నాటికి అధికారాన్ని అందుకోవాలని తెగతాపత్రయపడుతోంది. ఇలాంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజనను అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా వ్యవహరించే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. కానీ రాష్ట్రంలో తమకు ఉన్న సంస్థాగత బలం.. ఉపయోగపడుతుందనేది బీఆర్ఎస్ లెక్కగా ఉంది. తెలంగాణలో ప్రస్తుతం 17 పార్లమెంటు నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్, బీజేపీ 2024 ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు చొప్పున గెలుచుకున్నాయి. 1971 జనాభా లెక్కల ప్రకారం 1972లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తర్వాత? నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. కానీ? కొన్ని పరిధులు, పేర్ల మార్పుతో 2009లో ఎన్నికలు జరిగాయి. జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజక వర్గాల పునర్విభజన ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. కానీ ఇప్పుడు కేంద్రం మాత్రం 2011లో చేసిన జనగణన ఆధారంగా డీలిమిటేషన్‌కు రెడీ అయింది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి తీరాలని ..ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అనే ప్రజాస్వామిక సూత్రం నిర్దేశిస్తుంది. ఈ సూత్రం ఉల్లంఘనకు గురైతే పెద్ద నియోజకవర్గాలలోని ఓటు విలువ చిన్న నియోజకవర్గాలలోని ఓటు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఈ సూత్రాన్ని ఏ మేరకు ఫాలో అవుతారనేది చూడాల్సి ఉంది. ప్రస్తుతానికి 50 శాతం సీట్ల పెంపు అని చెబుతున్నా.. సమాన ఓటు విలువ విషయంలో తేడాలొస్తాయేమోననే సందేహాలు లేకపోలేదు. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా ఉండాలి. ఏతావాతా ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా.. ప్రజా ప్రాతినిధ్యానికి ఇబ్బంది లేకుండా డీలిమిటేషన్ చేయాలనేదే రాజ్యాంగం సూత్రీకరణ. దేశంలో గతంలో జరిగిన పునర్విభజన ప్రక్రియలు కూడా ఇదే విషయం చెబుతున్నాయి. మరి ఇప్పుడు జరిగే డీలిమిటేషన్ ఎలా జరుగుతుందోనని ఏపీతో పాటు అన్ని రాష్ట్రాలూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

### మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో

# రైతులకు ఇబ్బందులు కలుగకూడదు



**- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

నిర్మల్ మే12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హమాలీలు, గన్ని సంచులు, ధాన్యం తరలింపునకు లారీలు, ధాన్యం నిల్వ చేయడానికి తగిన స్థలాల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం సరఫరాకు అవసరమైతే లారీలతో పాటుగా ట్రాక్టర్లను కూడా వినియోగించుకోవాలన్నారు. ధాన్యం తరలింపుకు సంబంధించి లారీల కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియకు అవసరమైతే స్థానిక హమాలీలను నియమించుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారికి రశీదులు ఇవ్వాలన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు తమ పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్లందరూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలిగితే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో పాల్గొన్నారు.

వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న, వరి పంటల కొనుగోలు సాఫీగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి అన్లోడింగ్ పాయింట్ లు దగ్గర్లో ఉంటే ట్రాక్టర్ల ద్వారా ధాన్యం సంచులు తరలించే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచులు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు. ధాన్యం తూకం, తరలింపులో ఎట్టి పరిస్థితుల్లో రైతుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని హెచ్చరించారు.

ఈ వీసీ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపునకు లారీలను సిద్ధం చేయాలి

**- గంజాల్ టోల్‌ప్లాజా వద్ద కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ**

**- రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం**

నిర్మల్ మే12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)



జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి, మొక్కజొన్న ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజా వద్ద లారీల సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. టోల్‌ప్లాజా మీదుగా వెళ్తున్న ఖాళీ లారీలను గుర్తించి, వాటిని ధాన్యం రవాణాకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీ డ్రైవర్లు, యజమానులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని వివరించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరగకుండా వెంటనే వాహనాలను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం మామడ మండలం న్యూ సాంగ్వి గ్రామ రహదారి వద్ద లారీల సేకరణ తీరును పరిశీలించిన కలెక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లారీల సేకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించాలని తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బందికి టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వాహనాలను ఆపిన వెంటనే సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమున్న కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యాన్నీ సహించబోమని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్లు సంతోష్, సరిత, శ్రీనివాస్, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు రిజిస్ట్రీ పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

- నకిలీ విత్తనాలు, ఎరువుల నియంత్రణకు శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ
- ఏఈవోలు క్షేత్ర స్థాయిలో వంద శాతం క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి
- పట్టణ ప్రాంతాల్లో విలీనమైన గ్రామాల్లో రైతు రిజిస్ట్రీని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి
- ఆయిల్ పామ్ సాగు లక్ష్యాల సాధనకు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు కలిసి పనిచేయాలి
- నకిలీ విత్తనాలపై సమాచారం కోసం జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి
- వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, మే 12(ప్రజా కలం న్యూస్ )

ఖరీఫ్ సాగు సీజన్‌కు ముందే రైతు రిజిస్ట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, రవాణా శాఖ, సీడ్ కార్పొరేషన్, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని ఆదేశించారు.




రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నకిలీ విత్తనాల నియంత్రణ కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విత్తన గోదాములు, సీడ్ షాపులపై నిరంతరం తనిఖీలు నిర్వహించి విత్తనాల నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ పొందిన విత్తన షాపుల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొంతమంది వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ రైతులను మభ్యపెట్టి నకిలీ విత్తనాలను విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి మోసాలను అరికట్టేందుకు రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రైతు వేదిక సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ( ఏ ఈ ఓ లు) పాల్గొని గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాలు చేపట్టిన చర్యల అనంతరం క్రమం తప్పకుండా మీడియా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ విత్తనాలపై సమాచారం అందించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులను అప్రమత్తం చేయడంలో అవగాహన కార్యక్రమాలు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.ఏఈవోలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వంద శాతం క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతు రిజిస్ట్రీని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచిస్తూ, ప్రతి ఏఈవో రోజుకు 20 రైతు రిజిస్ట్రీలు, ప్రతి ఎంఏవో 30 రైతు రిజిస్ట్రీలు పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో విలీనమైన గ్రామాల్లో రైతు రిజిస్ట్రీ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సాగు ప్రారంభానికి ముందే రైతు రిజిస్ట్రీ పూర్తి కావాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రైతు రిజిస్ట్రీ ఆధారంగానే అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరా నిర్వహించబడుతుం దని తెలిపారు.ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారీ డి.పుల్లయ్య, వ్యవసాయ, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ మే12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం, పట్టణంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్, పిల్లలతో ముచ్చటించి వారి వివరాలు, జీవిత లక్ష్యాలు ఏంటో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సమ్మర్ క్యాంప్ కి రావాలని చెప్పారు. సమ్మర్ క్యాంపులో ఆటలు, పాటలు, యోగ, డ్యాన్స్, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వేసవి శిబిరాలతో పిల్లల నైపుణ్యాల పెరుగుదలతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందన్నారు.

ఉపాధ్యాయులు, శిక్షకులు, వేసవి శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని విషయాలు చక్కగా నేర్పించాలని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.


పదవ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, అందరూ ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని, అధైర్య పడవద్దని ప్రోత్సహించారు. ఆయా సబ్జెక్టులు శ్రద్ధగా చదువుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. వారి భయాలు, సందేహాలు తొలగించి, వారిని ప్రోత్సహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సుడా చైర్మన్ దుర్గాప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపిన రావుల గోపి గౌడ్

తల్లాడ మే 12 ప్రజా కలం న్యూస్ : సుడా చైర్మన్ గా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు రావుల గోపి గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న దుర్గప్రసాద్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సుడా చైర్మన్ గా జిల్లా బాధ్యతలు చేపట్టినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



ఈ సందర్భంగా కొద్దిసేపు పలు విషయాలు గురించి చర్చించుకున్నారు. ఎప్పటినుంచో ఆయనతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, చైర్మన్ పదవి రావటం సందర్భంగా ప్రత్యేకంగా కలిసినట్లు గోపి గౌడ్ తెలిపారు.

## సోలార్ విలేజ్ గా రఘునాథపాలెంను అభివృద్ధి చేయాలి

- కమ్యూనిటీ భవనాలపై కూడా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలి
- సెన్సస్-2027 సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలి
- తప్పుడు సమాచారం ఇవ్వకుండా సరైన వివరాలు నమోదు చేయాలి
- రఘునాథపాలెం గ్రామంలో సోలార్ మోడల్ ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం మే 12(ప్రజా కలం న్యూస్ ) : జిల్లాలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా రఘునాథపాలెం గ్రామాన్ని సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థ కలిగిన పైలట్ గ్రామంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. రఘునాథపాలెం గ్రామంలో అమలవుతున్న సోలార్ మోడల్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌ల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 1081 మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉన్నారని, వారిలో 821 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 110 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు పూర్తయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, రఘునాథపాలెంను భవిష్యత్తులో “సోలార్ విలేజ్”గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రతి ఇంటికి కనీసం 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్రామంలోని కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, ఇతర సామూహిక ప్రదేశాలపై కూడా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న సెన్సస్-2027 కార్యక్రమంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. జనగణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజలు సరైన సమాచారాన్ని అందించాలని, ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తప్పుడు సమాచారం ఇవ్వవద్దని సూచించారు. జనగణన కారణంగా ఎలాంటి ప్రభుత్వ పథకాలు ప్రభావితం కావని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహీద్, సంబంధిత శాఖల అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం

# పారదర్శకంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ - ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించి రీ సర్వే చేయాలి**

**ప్రభుత్వ భూములు, రహదారులు, ప్రజా స్థలాల వివరాలు కోఆర్డినేట్లతో నమోదు చేయాలి**

**రోజుకు ప్రతి బృందం 50 నుండి 70 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలి**

**సర్వే వివరాల డేటా ఎంట్రీ, మ్యాప్ తయారీ సమాంతరంగా కొనసాగాలి**

**తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో చేస్తున్న రీ సర్వే అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్**



పాలేరు మే 12(ప్రజా కలం న్యూస్ )రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం పరిశీలించి రీ సర్వే నిర్వహిస్తున్న అధికారులను కలిసి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, కాకరవాయి గ్రామంలో ఆర్ఎస్ఆర్ పట్టా విస్తీర్ణ సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారం కోసం రీ సర్వే చేపడుతున్నామని, భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల నవీకరణ లక్ష్యంగా రీ సర్వే చేపట్టి, భూముల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయనున్నట్లు చెప్పారు. రైతు వేదికను కేంద్రంగా చేసుకుని అక్కడే కంప్యూటర్ ఏర్పాటు చేసి భూ వివరాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో రీ సర్వే నిర్వహణ కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి బృందంలో ఒక సర్వేయర్, జీపీవోలు ఉంటారని చెప్పారు. రీ సర్వే ప్రక్రియలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, జీవో ప్రకారం విధి విధానాలు అమలు చేయాలని ఆదేశించారు. మొదట ఫారం-6 ఇవ్వాలని, అనంతరం 15 రోజుల గడువు పాటించిన తరువాతే తదుపరి ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పూర్తి ప్రక్రియను గుర్తించి అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం ఎస్ఓపీ సిద్ధం చేసుకుని దశలవారీ విధానాన్ని ఖచ్చితంగా అనుసరించాలని తెలిపారు. గ్రామంలోని అన్ని రహదారులు, ప్రజా స్థలాలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ సంస్థల భూముల వివరాలను కోఆర్డినేట్లతో సహా ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టంగా పంచనామా చేసి నమోదు చేయాలని సూచించారు. ప్రతి బృందం రోజుకు 50 నుంచి 70 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలని, ఐదు బృందాలు కలిసి రోజుకు సుమారు 250 నుంచి 300 ఎకరాల వరకు సర్వే నిర్వహించాలని కలెక్టర్ లక్ష్యాలను నిర్దేశించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే బృందాలు క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి రైతు పేరు, భూ విస్తీర్ణం, పూర్తి వివరాలు సేకరించి నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజూ సర్వే నివేదికలు సమర్పించాలని, సర్వే వివరాల డేటా ఎంట్రీ, మ్యాప్ తయారీ ప్రక్రియ సమాంతరంగా కొనసాగాలని తెలిపారు. ఈ గ్రామంలో ఆర్ఎస్ఆర్ పట్టా విస్తీర్ణ సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారం కోసం రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రీ సర్వే ద్వారా ఎవరూ తమ భూమి విస్తీర్ణాన్ని కోల్పోరని స్పష్టం చేశారు.ప్రస్తుతం గ్రామంలో సర్వే నంబర్ల విషయంలో ఉన్న గందరగోళం పూర్తిగా తొలగిపోతుందని, అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. రీ సర్వే విజయవంతంగా నిర్వహించాలంటే గ్రామ సభలు నిర్వహించడం తప్పనిసరి అని చెప్పారు. రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న మూడు గ్రామాల ప్రజలందరినీ గ్రామ సభకు ఆహ్వానించాలని సూచించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో రీ సర్వే సమయంలో వివిధ సమస్యలు వచ్చే అవకాశముందని, అందుకే ఆర్డీఓ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే కమిటీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, కమిటీ ఆమోదించిన తరువాత మాత్రమే సర్వే ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఎలాంటి వివాదాలకు దిగకుండా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, సర్వేయర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జీళ్ళచెరువులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



పాలేరు మే 12(ప్రజా కలం న్యూస్ ) కూసుమంచి మండలం పరిధిలోనే మంగళవారం జీళ్ళచెరువు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా అర్చకులు చిలకమర్రి స్వామినాథ్ చార్యులు ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, ఆకు పూజ చేశారు. స్థానిక భక్త భజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణము జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐతగాని వెంకటరమణ నాగేశ్వరరావు, వార్డు సభ్యుడు పెంద్ర అంజయ్య, భక్తులు చెన్నా వెంకన్న, విజయ్, అంబాల సైదులు, మల్లెల రవికుమార్, బూర్లే రవికుమార్, మాజీ దేవాలయ చైర్మన్లు బొడ్డు నరేందర్, బూర్లే వీరబాబు, చెన్నా వీరభద్రం, గోగుల అంజయ్య, చారి, భాస్కర్ చారి, మెట్టెల లింగయ్య, ఉడుగు ఉదయ్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, ముద్రబోయిన నాగేశ్వరరావు, కొండపల్లి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాల పై పోలీసుల దాడులు


**- కొయ్యూరు ఎస్ఐ 2 వైనాల రజన్ కుమార్**



మల్హర్, మే 12 ప్రజాకలం ప్రతినిధి

మండలంలోని అడువాలపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై కొయ్యూరు పోలీసులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. కొయ్యూరు ఎస్ఐ-2 వైనాల రాజన్ కుమార్ ఆధ్వర్యంలో అందిన ముందస్తు సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టారు.ఈ తనిఖీల్లో భాగంగా సుమారు 35 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోగా, సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 120 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు అక్కడికక్కడే ధ్వంసం చేశారు. గ్రామాల్లో అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం చేతుల మీదుగా ప్రిన్సిపల్‌కు రూ. లక్ష నగదు ప్రోత్సాహం




మల్హర్, మే 12 ప్రజాకలం ప్రతినిధి

మండల కేంద్రమైన తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల 2025-26 ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం సాధించినందుకు గాను కళాశాల ప్రిన్సిపల్ విజయ దేవికి ప్రభుత్వం నుండి గౌరవం లభించింది. సోమవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన 'విద్యా వారోత్సవాల' ప్రారంభంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆమె రూ. లక్ష చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రిన్సిపల్‌కు అభినందనలు తెలిపారు. కాగా, రెండో రోజు వారోత్సవాల్లో భాగంగా కళాశాలలో విద్యార్థులకు కౌన్సిలింగ్, మోటివేషన్ తరగతులు నిర్వహించారు.

## బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి

**- ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సమ్మయ్య నాయక్**


మల్హర్, మే12 ప్రజాకలం ప్రతినిధి

సాధారణ ప్రజలకు ఒక నీతి, కేంద్ర మంత్రి కుమారుడికి మరో నీతా? అని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పిఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,బిసి, ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కో-కన్వీనర్ అజ్మీర సమ్మయ్య నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథపై పోక్సో కేసు నమోదైనప్పటికీ, నేటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా సమ్మయ్య నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని విమర్శించారు. ఒక మైనర్ బాలిక న్యాయం కోసం మూడు నెలలుగా పోరాడాల్సి రావడం



రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. బాధితురాలు మరియు ఆమె కుటుంబాన్ని నేరస్థులు వేధించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు."భేటీ బచావో" అం టూ పెద్ద పెద్ద మాటలు చెప్పే బీజేపీ నాయ కత్వం, తమ సొంత కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. అన్ని ఆధారాలతో మైనర్ బాలిక ఫిర్యాదు చేసినా, అధికారులు వెంటనే స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. రాజకీయ పలుకుబడితో కేసును నీరుగార్చాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే సాయి భగీరథను అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని అజ్మీర సమ్మయ్య నాయక్ హెచ్చరించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



( వరంగల్/ పర్వతగిరి) మే 12, ప్రజాకలం ప్రతినిధి.

మంగళవారం పర్వతగిరి మండలంలోని దేవిలాల్ తండకు చెందిన జాటోతు నీలమ్మ ధర్మానాయక్ గార్ల ప్రధమ పుత్రుడు రాజు నాయక్ సౌందర్య తో వివాహం జరగగా అట్టి వివాహానికి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన టేస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు. ఈ కార్యక్రమంలో కిసాన్ సేల్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాటోతూ శ్రీనివాస్ నాయక్, మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు, నాయకులు గుగులోతు బాలు తదితరులు పాల్గొన్నారు.


## చింత నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి మధ్యాహ్నం 12 గంటలకే తాళం

**- తాళం వేసిన ఫోటోలను మండల వైద్యాధికారికి పంపగా ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తాం**

**- మండల వైద్యాధికారి ఉదయ్ రాజ్**

( వరంగల్/ పర్వతగిరి) మే 12, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకే తాళం వేసి ఉండటం స్థానికుల్లో ఆగ్రహానికి దారితీసింది. అత్యవసర వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉపకేంద్రం వైద్యురాలు నవ్య కృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించగా, నేను భోజనానికి వెళ్లాను.. ఏఎన్ఎం రజిత ఫీల్డ్‌లో ఉన్నారు. ఆశా వర్కర్‌కు చెప్పి కేంద్రం ఓపెన్ చేయిస్తాను అని తెలిపారు. అనంతరం ఏఎన్ఎం రజిత మాట్లాడుతూ, నేను ఫీల్డ్‌లో ఉన్నాను. మేడం సెలవులో ఉన్నారు. ఆశా వర్కర్ ద్వారా పల్లె దవాఖాన తెరిపిస్తాను అని చెప్పారు. దాదాపు మూడు గంటల తర్వాత ఆశా వర్కర్ ఫోన్ చేసి ఉపకేంద్రాన్ని తెరిచినట్లు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై స్పందించిన వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ రాజ్‌కు తాళం వేసిన ఫోటోలను పంపి వివరణ కోరగా, చింతనెక్కొండ ఉపకేంద్ర సిబ్బందిపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని వారి సూచనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## బాలికల సాధికారతకే స్నేహ సమ్మర్ క్యాంపులు

**- బాలికలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి**

**- విషయపరిజ్ఞానంతోనే సాధికారత సాధ్యం**

**- సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య**



( వరంగల్/పర్వతగిరి )మే 12, ప్రజాకలం ప్రతినిధి.

జిల్లాలోని 15 నుండి 18 సంవత్సరాల పైబడిన బాలికల కోసం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశానుసారం డిఆర్డిఓ నాగపద్మజల సూచన మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్నేహ బాలిక సంఘాలకు సమ్మర్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే అనంతారం, గోపనపల్లి, కొంకపాక గ్రామాల్లో స్నేహ బాలికల సమావేశం నిర్వహించడం జరిగిందని కొంకపాక క్లస్టర్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య తెలిపారు. ఈ సందర్భంగా గోపనపల్లిలో వెలుగు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా బాలికలకు సూచనలు చేశారు. కౌమర దశలో వచ్చే శారీరక మానసిక మార్పులతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణ కొరకు వైద్య పరీక్షలు, పోషకాహారం వ్యక్తిగత పరిశుభ్రత మొదలగు విషయాలపై శ్రద్ధ చూపాలని సూచించారు. నాయకత్వ లక్షణాలు ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండి వ్యక్తిగత వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఆటపాటలతో కూడిన ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

బాలికల ఆసక్తిక అనుగుణంగా లక్ష్యసాధన కొరకు ఈ సమ్మర్ క్యాంపులలో మార్గ నిర్దేశం చేయడం జరుగుతుందని తెలిపారు. అందుకు బాలికలు బాలికల తల్లిదండ్రులు సమ్మర్ క్యాంపులు విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామైక్య సంఘాల కమ్యూనిటీ కోఆర్డినేటర్లు శ్యామ్, దేవేంద్ర సుధాకర్, వివోఏలు మౌనిక, లావణ్య, సంతోష, సంధ్య, రాజేశ్వరి, జోష్ణ, శ్రావణి, యశోద, కరుణ, ఉమా, రాధిక వివిధ గ్రామాల వివో ప్రతినిధులు బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

( వరంగల్/ పర్వతగిరి) మే 12, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని దేవిలాల్ తండా కి చెందిన జాటోతు నీలమ్మ - ధర్మ నాయక్ గార్ల కుమారుడు రాజు -సౌందర్యల వివాహపు విందు కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాటోతూ శ్రీనివాస నాయక్, మండల సర్పంచ్ చీదురు శంకర్, తొర్రి పద్మ, మాజీ ఉపసర్పంచ్ జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోతు భాస్కర్ నాయక్, మంగ్యా నాయక్, ఎస్సై బి ప్రవీణ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# హమాలీలకు అండగా నిలిచిన జఫరఘడ్ లయన్స్ క్లబ్

**-దివీటిపల్లిలో దుప్పట్ల పంపిణీ..**

**- ఎండల నుంచి రక్షణకు టెంట్లు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచన**



మే 12 ప్రజాకలం ప్రతి నిది: (వరంగల్ /వర్ధన్నపేట)

కష్టజీవులైన హమాలీల సంక్షేమానికి సామాజిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జఫర్గడ్ ప్రతినిధులు పేర్కొన్నారు. వర్ధన్నపేట మండలం దివీటిపల్లి గ్రామంలో నూతనంగా ప్రారంభించిన పి ఎ సి యస్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ జఫర్గడ్ ఆధ్వర్యంలో హమాలీలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ కర్క నరసింహారెడ్డి మాట్లాడుతూ, మండుతున్న ఎండల్లో కష్టపడుతున్న హమాలీల ఆరోగ్యం దృష్ట్యా వారికి తాగునీటి సదుపాయం, నీడ కోసం టెంట్లు, విశ్రాంతి ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కూలీల సంక్షేమం కోసం ప్రతి సంస్థ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ మామిడాల పూర్ణచందర్ మాట్లాడుతూ, సమాజ సేవే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని, అవసరమైన చోట సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. హమాలీలకు దుప్పట్లు అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెకండ్ వైస్ ప్రెసిడెంట్ మంచాల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి లయన్ అంచూరి యుగంధర్, జి టి ఓ కోఆర్డినేటర్ రొడ్డ రాజు, ఎల్ ఈ ఓ కోఆర్డినేటర్ బైరి వెంకటేశ్వర్లు, పి ఆర్ ఓ భువనగిరి శ్రవణ్ కుమార్, క్లబ్ ప్రతినిధులు బజ్జూరి సంతోష్ కుమార్, పాలకుర్తి నాగార్జున్ పాల్గొన్నారు. అలాగే సి ఎసి యాస్ సెక్రటరీ వెంకన్న, ఐ కే పి సెంటర్ ఇన్‌చార్జ్ కందిక రాజు, దివీటిపల్లి వార్డు సభ్యుడు కంజర్ల దయాకర్, రైతులు గోపాల్, యాదవ రెడ్డి, రామ్ రెడ్డి తదితరులు, గ్రామస్తులు హాజరయ్యారు. కార్యక్రమంలోహమాలీలు లయన్స్‌క్లబ్ సేవలనుఅభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# నాగులమ్మ క్రాస్ వద్ద ఘోర ప్రమాదం

**- ఇసుక లారీ, బొగ్గు టిప్పర్ ఢీ - డ్రైవర్ దుర్మరణం**

**- యమపాశాల్లా మారుతున్న ఎంఏఆర్ఎల్ బొగ్గు లారీలు**



మల్హర్ మే 12 ప్రజాకలం ప్రతినిధి...

భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల పరిధిలోని కొయ్యూరు సమీపంలో గల నాగులమ్మ క్రాస్ వద్ద చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ నుండి బొగ్గు తరలించే బొగ్గు టిప్పర్ కాటారం నుండి తాడిచెర్ల కి వెళ్తుండగా అలాగే మంథని నుండి కాటారం వైపు ఇసుక లారీ నాగులమ్మ క్రాస్ వద్ద ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద ధాటికి ఇసుక లారీ డ్రైవర్, నిజామాబాద్ జిల్లాకు చెందిన కేతి శ్రీనివాస్ (35) లారీ క్యాబిన్‌లోనే చిక్కుకుపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్, ఎస్ఐ 2 రజన్ కుమార్ లు ఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ టిప్పర్ డ్రైవర్ ను వెంటనే 108 అంబులెన్స్‌లో భూపాలపల్లిలోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తాడిచెర్ల నుండి భూపాలపల్లి జెన్కోకు బొగ్గు తరలించే ఎంఏఆర్ఎల్ ట్రాన్స్‌పోర్ట్ లారీలు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు మండిపడుతున్నారు. గతంలోనూ మల్లారం, రావులపల్లి పరిసరాల్లో ఈ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల వల్లే పలు ప్రమాదాలు జరిగాయని, అధిక లోడుతో జనావాసాల గుండా అతివేగంతో వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ వడ్లకొండ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. పోలిసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శివకాశీనుంచి తొలి మహిళా ఎమ్మెల్యే

**- ఆరు భాషలలో దిట్ట**

శివకాశీ : తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికరమైన అధ్యాయం మొదలైంది. ఏపీ తెలుగుదేశం పార్టీ విజయానికి తెరవెనుక వ్యూహాలు రచించిన ఓ యువతి, ఇప్పుడు ఏకంగా తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. రాజకీయ వ్యూహకర్త స్థాయి నుంచి మంత్రిగా ఆమె ఎదిగిన తీరు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆమే ఎస్. కీర్తన. అతి పిన్న వయస్కురాలిగా, ఏకైక మహిళగా కీర్తన చరిత్ర సృష్టించారు. శివకాశీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఆరు దశాబ్దాల చరిత్రలో ఆ స్థానం నుంచి ఎన్నికైన తొలి మహిళగా నిలిచారు. విరుదునగర్ జిల్లాలో 1996లో పుట్టిన కీర్తన, తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ తమిళ మీడియం పాఠశాలలో పూర్తి చేశారు. ఆ తర్వాత మదురై కామరాజ్ యూనివర్సిటీ అనుబంధ కళాశాల నుంచి బీఎస్సీ మ్యాథమెటిక్స్‌లో పట్టా పొందారు. ఉన్నత చదువులపై ఆసక్తితో పుదుచ్చేరి యూనివర్సిటీలో చేరి 2019లో ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. రాజకీయాల్లోకి రాకముందు కీర్తన, ఐప్యాక్ మరియు షోటైమ్ కన్సల్టింగ్ వంటి ప్రఖ్యాత పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్థల్లో డిజిటల్ క్యాంపెయిన్ స్ట్రాటజిస్టు పనిచేశారు. ఈ క్రమంలో ఆమె దేశంలోని పలువురు అగ్రశ్రేణి నాయకులతో కలిసి పనిచేసే అవకాశం దక్కించుకున్నారు.

## బీజేపీ అవకాశవాద రాజకీయాలను

# కడప ప్రజలు తిప్పికొట్టాలి

**- మతోన్మాద శక్తుల కుట్రలు ప్రజలు అప్రమత్తంగా గమనించాలి**

**- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

కడప : రాష్ట్రంలో బీజేపీ, మతోన్మాద శక్తులు అమలు చేస్తున్న అవకాశవాద రాజకీయాలను కడప ప్రజలు అప్రమత్తంగా గమనించాలని, ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించే కుట్రలకు లోనుకావద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడమే బీజేపీ ప్రధాన అజెండాగా మారిందన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, కేంద్రం ఇచ్చిన హామీల అమలు వంటి కీలక అంశాలపై సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. 2018లో బీజేపీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ ఇప్పటివరకు అమలు కాలేదని, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు హామీ పూర్తిగా గాలిలో కలిసిపోయిందని గుర్తుచేశారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం నిధులు, పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పకుండా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం దుర్మార్గ రాజకీయమన్నారు. కడప నగరంలో కావాలనే శాంతిభద్రతల కు విఘాతం కలిగించే విధంగా కొన్ని మతోన్మాద శక్తులు వ్యవహరిస్తున్నాయని తప్పుపట్టారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చంద్రబాబు.. కడపలోని అల్మాస్‌పేట సర్కిల్‌ను టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా అభివృద్ధి చేస్తామని బహిరంగ సభలో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం కడప కార్పొరేషన్ కూడా ఈ అంశంపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ప్రతిపాదనలు పంపిందన్నారు. ఇప్పుడు అదే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం మతోన్మాద శక్తులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న పరిస్థితిని ఆసరాగా చేసుకొని కొందరు కావాలనే ఉద్రిక్తతలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కడప నగరంలో సామరస్య వాతావరణాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కడపలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను చల్లార్చాలని, అన్ని వర్గాల ప్రజలతో చర్చలు జరిపి మత సామరస్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కుట్రపూరితంగా ప్రజలను రెచ్చగొట్టే శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైతే దాని పూర్తి బాధ్యత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని ఈశ్వరయ్య హెచ్చరించారు. ప్రజలు మతం, కులం పేరుతో విడిపోకుండా ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడాలని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపైనే రాజకీయ చర్చలు జరగాలని కోరారు.

# కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కంబాల శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక

సత్తెనపల్లి : పిడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ మహాసభ పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని అరండలపేట యూనియన్ ఆఫీస్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. పీడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన కంబాల శ్రీనివాస్ ను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ, వర్క్ చార్జింగ్ సిబ్బంది సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నది కెనాల్స్ వర్కర్స్ యూనియన్ అని శ్రీనివాస్ గుర్తు చేశారు. శ్రీనివాస్ ఎన్ని కావటం పట్ల కెనాల్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డివిజన్ గౌరవాధ్యక్షులు స్థానిక న్యాయవాది నరిశెటి వేణుగోపాల్, ఎఐటియుసి సత్తెనపల్లి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఈసిరెడ్డి అంజిరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యల్లమంద, మస్తాన్ వలి, యేసయ్య, భాస్కర్, కిరణ్, ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, వల్లెం లక్ష్మీ చెన్నకేశవ, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డీ.ఆర్. మస్తాన్, పోకల శంకర్, సిపిఐ సత్తెనపల్లి నియోజకవర్గం కార్యదర్శి ముసునూర్ రమేష్, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు ఎస్ఎమ్ సుభాని, జిల్లా నాయకులు జె విజయ ప్రసాద్, ఎం అప్పారావు, కే సురేష్. టి రాజు, ఎస్ టి యు సత్తెనపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు పి వెంకయ్య, ఎస్ సుభాని, ప్రజా చైతన్య భారతి ఉపాధ్యక్షులు పి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కె. ప్రేమ్ కుమార్, ప్రభుత్వ వైద్యశాల శానిటరీ అండ్ సెక్యూరిటీ గార్డుల వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, జోసఫ్, శేఖరు, అన్నమ్మ, భారతి, భవాని, పట్టణ ప్రముఖులు తాండవ కృష్ణ, కే వెంకటేశ్వరరావు, ఎం వెంకటరావు, జర్నలిస్ట్ యూనియన్ పల్నాడు జిల్లా నాయకులు ఎస్ కె. సైదా, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎం ఏడుకొండలు, బి. సంగీతారావు, ఏపీఎస్ఆర్టీసీ హయ్యర్ బస్ డైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డిపో అధ్యక్షులు కొలుసు యలమంద, కోశాధికారి టీ. ప్రదీప్ చంద్ర, ఏ. కోటేశ్వరరావు, తదితరులు కంబాల శ్రీనివాస్ కు అభినందనలు తెలియజేశారు.

# బండి సంజయ్ కొడుకు చుట్టూ రాజకీయం

కరీంనగర్ : కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ చుట్టూ ప్రస్తుతం ఒక పెను సంచలనం నెలకొంది. హనీ ట్రాప్, బ్లాక్‌మెయిల్, మైనర్ వేధింపుల వంటి తీవ్రమైన ఆరోపణలతో కూడిన ఈ వ్యవహారం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో ఇరు పక్షాల నుంచి పరస్పర విరుద్ధమైన ఫిర్యాదులు అందడం రాజకీయంగానూ, సామాజికంగానూ పెను దుమారం రేపుతోంది. బండి భగీరథ్ కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో స్వయంగా ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తనను కొంతకాలంగా ఒక కుటుంబం పథకం ప్రకారం హనీ ట్రాప్ చేసి, బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన ఒక కుటుంబం తన నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేస్తోందని భగీరథ్ ఆరోపించారు. స్నేహితుల ద్వారా పరిచయమైన సదరు యువతితో కలిసి పార్టీలు, ఫంక్షన్లు, చివరకు గుడులకు కూడా వెళ్లానని, అయితే ఇప్పుడు ఆ సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని వీడియోలు, చాటింగ్ స్క్రీన్ షాట్లతో తనను వేధిస్తున్నారని ఆయన వెల్లడించారు. ఇప్పటికే సదరు యువతి తండ్రికి రూ.50,000 చెల్లించానని, అయినప్పటికీ వారు ఇంకా పెద్ద మొత్తంలో డబ్బు కావాలని ఒత్తిడి తెస్తున్నారని భగీరథ్ పోలీసులకు వివరించారు. భగీరథ్ ఫిర్యాదు చేసిన కొద్ది సేపటికే సదరు యువతి కుటుంబం కూడా పోలీసులను ఆశ్రయించడం ఈ కేసులో కీలక మలుపు. అయితే, వారు హైదరాబాద్‌లో ఫిర్యాదు చేస్తూ భగీరథ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ యువతి మైనర్ అని, భగీరథ్ ఆమెను వేధించాడని ఆ కుటుంబం పేర్కొంది. ఒకవేళ ఈ ఆరోపణలు నిజమని ప్రాథమిక విచారణలో తేలితే, భగీరథ్‌పై అత్యంత కఠినమైన పోక్సో చట్టం కింద కేసు నమోదయ్యే అవకాశం ఉంది. ఇది బండి సంజయ్ కుటుంబానికి రాజకీయంగా పెద్ద ఇబ్బందిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ మొత్తం ఉదంతం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందనే ప్రచారం కూడా బలంగా సాగుతోంది. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనకు ముందు ఈ వివాదం తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరగబోతోందని, ఈ క్రమంలో బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తప్పించి, ఆ స్థానాన్ని దక్కించుకోవాలని చూస్తున్న సొంత పార్టీకి చెందిన కొందరు నేతలే ఈ వ్యవహారాన్ని వ్యూహాత్మకంగా బయటకు తెచ్చారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేసుపై రెండు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్ర మంత్రి కుమారుడు నిజంగానే ఒక ప్లాన్ ప్రకారం హనీ ట్రాప్‌కు గురయ్యారా? లేక మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ఆ తప్పు నుంచి తప్పించుకోవడానికి ముందే ఫిర్యాదు చేశారా? ఈ రెండు వెర్షన్లలో ఏది నిజమనేది పోలీసుల



లోతైన విచారణలో మాత్రమే తేలాల్సి ఉంది. ఒకవైపు కేంద్ర మంత్రి కుమారుడి హోదా, మరోవైపు మైనర్ బాలిక రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ కేసుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నిందితులు ఎవరైనా, చట్టం తన పని తాను చేసుకుపోతుందా లేదా రాజకీయ ఒత్తిళ్లు పని చేస్తాయా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

పొలిటికల్ టర్న్..

రాజకీయ నేతల పిల్లలు చేసే కొన్ని పనులు.. నేతలకు తలనొప్పిగా మారుతున్నాయి. రాజకీయంగా ఇబ్బందులు తెస్తున్నాయి. తాజాగా కేంద్ర మంత్రి బండి సంజయ్ విషయంలో కూడా ఆయన కుమారుడు సాయి భగీరథ్ చేసే పనులు ఇబ్బందిగా మారుతున్నాయి. కష్టపడి సామాన్య కార్యకర్త నుంచి కేంద్ర మంత్రి వరకు సంజయ్ ఎదిగారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని మహేంద్ర కాలేజీలో సహచర విద్యార్థిపై దాడి ఘటన సంచలనంగా మారింది. అప్పుడు సంజయ్ ఎంపీగా ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న సంజయ్ తనయుడిపై పోక్సో కేసు నమోదు కావడం ఇప్పుడు మరింత సంచలనంగా మారింది. ఇది క్రమంగా రాజకీయం రంగు పులుముకుంది. సంజయ్ ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు కుట్ర చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ నేతలు.. సంజయ్ తనయుడికి సంబంధించిన పాత ఘటనల ఫొటోలతోపాటు తాజా ఘటనల ఫొటోలు వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. సంజయ్ తనయుడి కొడుకు అంటూ సంజయ్ ఇమేజ్ డ్యామేజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. సంజయ్ తనయుడిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై కేంద్ర మంత్రి తాజాగా స్పందించారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'నాకు చట్టంపై గౌరవం, న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది. జీవితాంతం భారత రాజ్యాంగానికి కట్టుబడే ఉన్నాను. దశాబ్దాలుగా ప్రజలతోనే ఉన్న నేను మచ్చ లేని జీవితం గడిపానని గర్వంగా చెప్పగలను. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు నా పిల్లలను, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగుతున్నారు. ఇది వారిలో గూడుకట్టుకున్న నిరాశ నిస్పృహలకు అద్దం పడుతుంది' అని పేర్కొన్నారు.

# పోలానికి నిప్పు... ఆగిపోయిన రైలు

నెక్కొండ : గుర్తు తెలియని వ్యక్తులు నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలో పొలానికి నిప్పు పెట్టారు. మంటలు రైల్వే ట్రాక్ సమీపంలో ఎగిసిపడటంతో సికింద్రాబాద్ నుండి భద్రాచలంలో వెళ్లే కాకతీయ ఎక్స్ప్రెస్ను సుమారు 30 నిమిషాల పాటు నిలిపివేసారు. సమాచారం అందిన వెంటనే రైల్వే సిబ్బంది, స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మొత్తానికి పెను ప్రమాదం తప్పింది.

# ఏసీబీ వలలో ఇద్దరు మునిసిపల్ ఉద్యోగులు

అనంతపురం : ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి దొరికిపోయాడు. రూ.25 వేలు లంచం తీసుకుంటూ మున్సిపల్ అధికారి చిక్కాడు. మున్సిపల్ డీఈ, జూనియర్ అసిస్టెంట్ అను ఏసీబీ ఆదుపులోకి తీసుకుంది. ఎగ్జిబిషన్కు పర్మిషన్ ఇచ్చేందుకు రూ.25 వేలు లంచం తీసుకుంటూ.. మున్సిపల్ డీఈ లక్ష్మీనరసింహులు, జూనియర్ అసిస్టెంట్ సందీప్ ఏసీబీ అధికారులకు రెడ్హ్యాండెడ్గా చిక్కాడరు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# కాకినాడలో దారుణం..

కాకినాడ : కాకినాడ నగరంలోని గాంధీనగర్లో దారుణ ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఏపీఎస్పీ (ఒఖూఖ) కానిస్టేబుల్ నాగేశ్వరరావును గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత క్రూరంగా హత్య చేశారు. ఒక్కసారిగా దాడి చేసిన నిందితులు, కత్తితో గొంతు కోయడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. జనసంచారం ఉండే ప్రాంతంలోనే ఈ హత్య జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో భాగంగా పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పాత కక్షల కారణంగానే ఈ హత్య జరిగిందా లేక వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ఏ2, ఏ3 అరెస్ట్

రాజమండ్రి : దళిత యువకుడు, ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను బెదిరించిన వ్యవహారంలో పోలీసులు మరో ఇద్దరు నిందితులు కడియాల చిన్నబాబు(ఏ2), కడియాల సతీశ్(ఏ3)లను అరెస్టు చేశారు. హైదరాబాద్లో తలదాచుకున్న వీరిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు అనంతబాబు ఆదేశాలతో చిన్నబాబే సాక్షులను బంధించి, ప్రలోభాలకు గురిచేసి బెదిరించినట్లు పోలీసులు గుర్తించారు. ఎమ్మెల్సీ అనంతబాబు జైలు నుంచే చిన్నబాబు ఫోన్కు వీడియో కాల్ చేసి సాక్షులను బెదిరించినట్లు సమాచారం. మాజీ మంత్రి కన్నబాబుకు సన్నిహితుడైన చిన్నబాబును విచారిస్తే, సాక్షుల కొనుగోలుకు ఉపయోగించిన నిధుల మూలాలు, ఆర్థిక లావాదేవీల వివరాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ అరెస్టుతో కేసు దర్యాప్తులో కీలక పురోగతి లభించింది.

# చేపల చెరువులో పడి ఇద్దరు మృతి..

గుంటూరు : పల్నాడు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. నరసరావుపేట మండలం కాకాని చేపల చెరువులో మేతకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు పడవ బోల్తా పడటంతో మృతి చెందారు. కొమ్మాలపాడు వాసులు చెరువును లీజుకు తీసుకొని చేపల పెంపకం చేపట్టారు. ఆదివారం చేపల మేతకు చెరువులోకి వెళ్లగా పడవ బోల్తాపడటంతో ఇద్దరు మృతి చెందినట్లు తెలిపారు. మృతులు అగ్రహారానికి చెందిన హుస్సేన్, పిట్టంబండ్ల హుస్సేన్ బుడేగా పోలీసులు గుర్తించారు.

# గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ

హైదరాబాద్ : గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. దొంగలు ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి భారీగా బంగారం, వెండి, నగదును అపహరించారు. జైన్ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తన బంధువుల పెళ్లికి ఆదివారం ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడినట్లు గుర్తించాడు. ఇంట్లో తనిఖీ చేయగా సుమారు 30 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.5 లక్షల నగదు దొంగిలించినట్లు తెలిసింది. వెంటనే గోషామహల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసారు.

# ఐదుగురి ప్రాణాలు బలిగొన్న యువకుల బైక్ రేసింగ్ సరదా

**మహబూబ్నగర్లో ఘోర రోడ్డు ప్రమాదం**

మహబూబ్ నగర్ : యువకుల బైక్ రేసింగ్ సరదా ఐదుగురి మృతికి దారి తీసింది. 140 స్పీడులో వెళుతున్న స్పోర్ట్స్ బైక్ కారును గుద్దింది. బైపాస్ రోడ్డులో జరిగిన ఘటనలొఓ ఐదుగురు మృతి చెందారు. బైక్ రేసింగ్లకు బైపాస్ రోడ్డు అడ్డాగా మారిందని, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికుల ఆరోపణ. ప్రమాదంలో కారులో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన అర్షియ బేగం(30), ఉజేప(7), అమర్(2)లు మరియు బైక్పై ఉన్న హైదరాబాద్కు చెందిన బైకర్ యాకుబ్ అఫ్జల్(25)తో పాటు మరో వ్యక్తి మృతి చెందారు.

# పీఎంజే జ్యువెల్లరీ కేసులో పురోగతి

**- పోలీసుల అదుపులో ఇద్దరు దుండగులు**

కరీంగనర్ : పీఎంజే జ్యువెల్లరీ కేసులోపొలీసులు పురోగతి సాధించారు. పోలీసుల అదుపులో ఇద్దరు దుండగులు వున్నట్లు సమాచారం. పోలీసులు బెంగాల్ లో నిందితుడిని పట్టుకుని కరీంనగర్ కు నిన్న అర్ధరాత్రి తీసుకువచ్చారు. నిందితుడి ద్వారా మిగతా వారి అచూకీ కోసం కూపీ లాగుతున్నారు. కరీంనగర్ నుంచి ధర్మపురి మీదుగా పారిపోతుండగా దుండగులు వాడిన సెల్ ఫోన్ ను మద్దునూర్ వద్ద పగులగొట్టారు. తరువాత ఆ మొబైల్ ఫోన్ యువకులకు లభించింది. వారు మొబైల్ ఫోన్ ను పోలీసులకు అప్పగించారు. ఫోన్ లో కీలక ఆధారాలు దొరికినట్లుగా సమాచారం.

వారం రోజులుగా నిందితుల కోసం పశ్చిమ బెంగాల్, బీహార్, ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర, రాజస్థాన్ ఐదు రాష్ట్రాల్లో కొనసాగుతున్న పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఇద్దరూ నిందితులతో పాటు, పీఎంజే నగల దుకాణంలో దోపిడీ చేసిన బంగారం కొనుగోలు చేసిన వ్యాపారినీ పట్టుకున్నట్లు సమాచారం.

# బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలి

సిరిసిల్ల : మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయాలంటూ సిరిసిల్ల నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై నాయకులు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గూడూరు ప్రవీణ్, రాష్ట్ర నేత చీటీ నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొని మీడియా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళాతో పాటు మహిళా కౌన్సిలర్లు తెలంగాణ భవన్లో ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు.



# తునికాకు సేకరణ కేంద్రాన్ని పరిశీలించిన ఎఫ్ఆర్ఓ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 12 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని వెలుట్ల పేట గ్రామంలో ఏర్పాటు చేసిన తునికాకు సేకరణ కేంద్రాన్ని మంగళవారం ఎఫ్ఆర్ఓ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో తునికాకు సేకరించిన వారికి డబ్బులు రాలేదని సర్పంచ్ కొయ్యల వినోద రాజా గౌడ్ ఎఫ్ ఆర్ వో దృష్టికి తీసుకెళ్లారు. త్వరగా ఆ బకాయి డబ్బులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎఫ్ ఆర్ ఓ రమేష్ సదరు రైతులకు పెండింగ్ డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు యాదవ్, వార్డ్ సభ్యుడు సాయిరాం, డిఆర్ఓ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

# జనగణన సర్వే ను పరిశీలించిన ఆర్డిఓ ప్రభాకర్





కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 12 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహిస్తున్న జనగణన సర్వేను మంగళవారం స్థానిక ఆర్డీవో ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జన గణన చేస్తున్న వారితో మాట్లాడి సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి తప్పులు దొరలకుండా చూసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు, అనుమానాలను తలెత్తితే నివృత్తి చేసుకోవడానికి సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాల న్నారు. ఆయన వెంట మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అమృత్ 2.0 పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్....

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులో జరుగుతున్న అమృత్ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరిత గతిన అమృత్ తాగునీటి పథకం పైపులైన్ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా పరిశీలించారు. వీలైనంత వేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట స్థానిక వార్డు కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# నేటి నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు...


కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 12 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుండి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు కళాశాల చీఫ్ సూపర్డెంట్ ఎన్ విశాల, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ బాలాజీ తెలిపారు. ఈ పరీక్షలు ఈనెల 13 నుండి 19వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తా మన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షల కోసం సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరపు అడ్మిషన్స్ ఈ నెల 12 నుండి ప్రారంభమ య్యాయని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి నిజాం తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరములో చేరగోరే విద్యార్థులు ఇంటర్నెట్ పదవ తరగతి పాస్ మెమో, 2 పాస్ ఫొటో లు తమ వెంట తెచ్చుకోవాలన్నారు.



# మానసిక ప్రశాంతతకు బుద్ధుని మార్గమే శరణ్యం: బంతే సత్యబోధి

నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) మే 12:

మానవ సమాజం ఎదుర్కొం టున్న మానసిక ఒత్తిడి, మూఢనమ్మకాల నుండి విముక్తి పొందేందుకు గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి మార్గమే దిక్సూచి అని బుద్ధగయ నుండి విచ్చేసిన బౌద్ధ భిక్షువు బంతే సత్యబోధి అన్నారు. ''ఊరు ఊరున ధమ్మా వదం'' కార్యక్రమంలో భాగంగా గత కొంతకాలంగా ఆయన నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్ మరియు విశాఖపట్నం జిల్లాల్లో పర్యటిస్తూ బౌద్ధ ధమ్మ ప్రవచనాలను అందిస్తున్నా రు.ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ, ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా పంచశీల, పంచస్కంధాలు, దశ పరిమితులు, శీలం,





సంఘం,కరుణ మరియు మైత్రి వంటి అంశాలపై బంతే గారు విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి మనిషి జంతువుల పట్ల, తోటి మనుషుల పట్ల కరుణా భావంతో ఉండాలని, బుద్ధుని అడుగుజాడల్లో నడవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఫిబ్రవరిలో సిరిసిల్ల జిల్లాలో పర్యటన:

ప్రస్తుతం తన పర్యటనను ముగించుకుని సంపూర్ణ జ్ఞానోదయ క్షేత్రమైన బుద్ధగయకు వెళుతున్నట్లు బంతే సత్యబోధి తెలిపారు. తిరిగి ఫిబ్రవరి నెలలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో తన ధమ్మ ప్రవచనాల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పర్యటనకు సంబంధించి సిరిసిల్లలోని ప్రాంతీయ బౌద్ధ సంఘాలు, ధమ్మ బంధువులు తమ పూర్తి సహకారాన్ని అందించి, బుద్ధుని సందేశాన్ని ఇంటింటికీ చేరవేయడంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# "మహాత్మా" సాక్షిగా ముంబై తెలుగు ప్రముఖులకు ఘనసన్మానం





నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 12:

ముంబై బహుజనులు 1888 మే 11న ముంబై మాండవి కోలివాడ లోని ఓ మరాఠా జ్ఞాతి సమాజ్ హాలులో జరిగిన ఓ భారీ సభలో జ్యోతిరావుకు "మహాత్మా" బిరుదుతో సత్కరించారు. దేశంలోని ఓ/బీసీ ఎస్సీ ఎస్టీ మహిళలకు విద్య కోసం ఆయన చేసిన విప్లవాత్మక కృషికి గుర్తింపుగా ప్రజలు గౌరవించారు. అనాడు అందులో మరాఠా, కున్బి, అగ్రి, కోలి మాలి, బండారి లతోపాటు తెలుగు వారైన జయ కారాడి లింగు, ఈర్లా సాయన్న, వెంకయ్య కారాడి, జయ లింగన్న సాయన్న, శ్యాంబా మాగుజి హమంద్ తదితరులు ఆ ఐతిహాసిక ఉత్సవంలో పాల్గొనడం చరిత్రాత్మకం. దానిని నేడు జ్ఞాపకార్థంగా ముంబైలోని ప్రఖ్యాత ఓబీసీ ఎస్సీ తెలుగు ప్రముఖులను "రాష్ట్రపితా మహాత్మా జ్యోతిరావు పూలే జన్మ ద్విశతాబ్ది మహోత్సవ సమితి" ఆధ్వర్యంలో సోమవారం ప్రభాదేవిలోగల రవీంద్ర నాట్య మందిర్లో సత్కరించారు. అతిథులుగా మహారాష్ట్ర మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కపిల్ పాటిల్ చేతుల మీదుగా ప్రఖ్యాత తెలుగు కవి రచయిత అంబాల జనార్ధన్ కి ప్రశంస పత్రమిచ్చి "పూలే తలపాగా" శిరస్సుపై ధరించి, షాల్వా కప్పి ఘనంగా సన్మానించారు. మరాఠీ చిత్రలేఖ ఎడిటర్ జ్ఞానేష్ మహారావు కవి నడిమెట్ల ఎల్లప్పకు పూలే పుస్తకం, సర్టిఫికెట్ ఇచ్చి, షాల్వా కప్పి గౌరవించారు. అదే రీతిలో యువనేత వంగల కృష్ణ యాదవ్, నవీముంబై నుంచి మందపెల్లి లక్ష్మణ్ నాయి, రజక యువనేత తడ్కపెల్లి నరేష్, అంబేడ్కరైట్ నేత వడ్డి సూర్యనారాయణ, సామల లక్ష్మణ్ యాదవ్, దాసరి రాజేంద్ర పద్మశాలి, మూలనివాసి మాలజీ లను సత్కరించారు. సభకు రోహిత్ డాలే వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: PDSU డిమాండ్





నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 12:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి ఎస్ యు) డిమాండ్ చేసింది. మంగళవారం కోటగల్లిలోని ఎన్.ఆర్ భవన్లో నిర్వహించిన పత్రికా సమావేశంలో (పి డి ఎస్ యు) జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, (పి వై ఎల్ )యువజన సంఘం అధ్యక్షులు డి. నవీన్ కుమార్ మాట్లాడారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం: లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడి నీట్ పరీక్ష రాస్తే, పేపర్ లీకేజీ అక్రమాల వల్ల వారి ఆశలు అడియాశలయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రం ముందుగానే లీక్ కావడం వల్ల పరీక్షా వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లిందని, ఇది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని మండిపడ్డారు.

ప్రధాన డిమాండ్లు:పరీక్ష రద్దు: అక్రమాలు జరిగిన నేపథ్యంలో ప్రస్తుత నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి, పకడ్బందీ భద్రతా చర్యల మధ్య తిరిగి నిర్వహించాలి.

న్యాయ విచారణ:

ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.

కఠిన చర్యలు: విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

కేంద్ర ప్రభుత్వం స్పందించాలి:కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో (పి డి ఎస్ యు) జిల్లా ఉపాధ్యక్షులు జి. నితిన్,జిల్లా యువజన సంఘం కార్యదర్శి సాయిబాబా, నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం.. రెండు భారీ లారీలు సీజ్!





నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే12:

జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, మైనింగ్ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ శాఖ చర్యలు ముమ్మరం చేసింది. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

చీతా ఫోర్స్ ఆకస్మిక దాడులు:

సీసీఎస్ ఏసీపీ (ఇన్చార్జ్) మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీతా ఫోర్స్ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచుతున్నారు. ఇందులో భాగంగా మోర్తాడ్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో రహస్య సమాచారం మేరకు విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపిస్తున్న వాహనాలను ఆపి తనిఖీ చేయగా, ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు 14 టైర్ల భారీ లారీలను పోలీసులు గుర్తించారు.

పట్టుబడిన వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వాటిని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత మోర్తాడ్, ఆర్మూర్ ఎస్హెచ్ఓలకు అప్పగించారు. ఈ ఇసుక ఎక్కడి నుండి వస్తోంది? దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

"అక్రమ ఇసుక తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, నదీ పరివాహక ప్రాంతాలు దెబ్బతింటున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది" అని పోలీస్ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

నిబంధనలు ఉల్లంఘించి అక్రమ మైనింగ్కు పాల్పడితే ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, రాత్రి సమయాల్లో కూడా చెక్పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తామని అధికారులు హెచ్చరించారు. అక్రమ రవాణాపై ప్రజలు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

# గోమాత రక్షణ చట్టాల పోస్టర్స్ ఆవిష్కరణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 12 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ దేశి గో వంశ రక్షణ సంవర్ధన సమితి ఆధ్వర్యంలో గోమాత చట్టాలకు సంబంధించిన పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా



విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ ప్రతినిధులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1977 గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఆక్రమణల లో ఉన్న గోచార భూములను విముక్తి చేయాలని, ప్రతి జిల్లాలో కనీసం 10 ఎకరాల స్థలంలో ప్రభుత్వమే గోశాలలను ఏర్పాటు చేయాలన్నారు. చట్ట విరుద్ధంగా నడుస్తున్న గోవధశాలలను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, గో ఆదారిత వ్యవసాయదారులకు సబ్సిడీలు ఇవ్వాలన్నారు.

ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కామారెడ్డి జిల్లా గోరక్ష ప్రముఖ్ తులసి దాస్, శ్రీ ప్రఖండ సంఘటన మంత్రి వినోద్ కుమార్, విశ్వహిందూ పరిషత్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు నవీన్, హరిబాబు, రాహుల్, హర్ష, పురుషోత్తం, యాదగిరి, విద్యాసాగర్, రాజ్ కుమార్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పుట్ట ఎల్లమ్మ ప్రతిష్టాపన ఉత్సవాలు

**- పోతరాజులు, శివసత్తులు నృత్యాల మధ్య అంగరంగ వైభవంగా వేడుకలు..**

**- అమ్మవారికి ఒడిబియ్యం, బోనాల సమర్పణ**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 12 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని బిక్కనూరు గ్రామంలో మంగళవారం పుట్ట ఎల్లమ్మ ప్రతిష్టాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు మాదాసు వాసవి గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్ట ఎల్లమ్మ జాతర



మహోత్సవాలు శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్య ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగాయి. ముందుగా గ్రామంలోని లందలో కొలువుదీరిన ఎల్లమ్మను బైండ్ల వారి ప్రత్యేక పూజలు చేసిన



పిదప భాజా భజంత్రీల చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పుట్ట ఎల్లమ్మ ప్రతిష్టాపన స్థలం వరకు తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలోని మహిళలు అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకొని డీజే చప్పుళ్లు, భాజా భజంత్రీల మధ్య ఊరేగింపుగా పుట్ట ఎల్లమ్మ విగ్రహం వరకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి,



తర్వాత అమ్మవారి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. చివరగా మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో మొత్తం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అమీర్ నగర్ శివారులో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి: ఆరుగురి అరెస్ట్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 12 :

కమ్మర్ పల్లి మండల పరిధిలోని అమీర్ నగర్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కమ్మర్‌పల్లి పోలీసులు మంగళవారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఎస్సై జి. అనిల్ రెడ్డి తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్ నగర్ గ్రామ శివారు ప్రాంతంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ మెరుపు దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ. 23,110 నగదు మరియు 6 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ లో జనగణన కార్యక్రమాన్ని పరిశీలించిన

### శంషాబాద్ జోనల్ కమిషనర్ మేడమ్ చంద్రకళ డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య

మహేశ్వరం, మే 12,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం బడంగ్‌పేట్ సర్కిల్‌లో జనగణన కార్యక్రమం ప్రారంభం శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ గారు మరియు డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య పరిశీలించారు.బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో 11.05.2026నుండి ప్రారంభమైన జనగణన కార్యక్రమాన్ని



జోనల్ మేడమ్ చంద్రకళ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య గారు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫీల్డ్‌లో ఇంటింటికి వెళ్లి జనగణన విధులు నిర్వహిస్తున్న సూపర్వైజర్లు మరియు ఎన్యుమరేటర్ల పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య, మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి ఖచ్చితమైన కుటుంబ వివరాలు సేకరించాలని, ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించాలని అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులు అధైర్యపడొద్దు: కలెక్టర్ ఇలా త్రిపాఠి

### సప్లిమెంటరీ శిక్షణ తరగతులను ప్రారంభించిన కలెక్టర్

### సెల్ ఫోన్లకు దూరంగా ఉండి లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని సూచన



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) మే 12:


పదో తరగతి ఫలితాల్లో ఒకటి, రెండు సబ్జెక్టులలో తప్పిన విద్యార్థులు అనవసర ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో విజయం సాధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదో తరగతి ప్రత్యేక శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం ముగిసిపోలేదని, ఓటములను భవిష్యత్తు విజయాలకు సోపానాలుగా మార్చుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. సప్లిమెంటరీ పరీక్షలకు ఇంకా మూడు వారాల సమయం ఉందని, ఈ సమయాన్ని ఏకాగ్రతతో వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు కొన్నాళ్ల పాటు సెల్ ఫోన్లను పక్కన పెట్టి, క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరై మంచి మార్కులు సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు సంతోషాన్ని ఇవ్వాలని కోరారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరడానికి అడ్డదారులు (షార్ట్ కట్స్) ఉండవని, కష్టపడి చదివితేనే భవిష్యత్తులో సుఖ సంతోషాలతో ఉండవచ్చని దిశానిర్దేశం చేశారు.అనంతరం శంకర్ భవన్ పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌ను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు వివిధ అంశాల్లో ఇస్తున్న తర్ఫీదు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎంఈవోలు సాయిరెడ్డి, అరవింద్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## విశ్వసనీయ పెట్టుబడి పరిష్కారంగా 12 ఏళ్ల వేడుక జరుపుకుంటున్న ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్ మరియు పిఎస్‌యు డెట్ ఫండ్

FRANKLIN TEMPLETON

ముంబై, మే 11,: ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్ మరియు పిఎస్‌యు డెట్ ఫండ్ , తన 12వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ విభాగంలో అత్యంత పురాతన పథకాలలో ఒకటిగా నిలిచిన ఈ ఫండ్, స్థిరమైన వృద్ధి మరియు డెట్ మ్యూచువల్ ఫండ్ రంగంలో విశ్వసనీయ పెట్టుబడి పరిష్కారంగా తన స్థానాన్ని మరింత బలపరుచుకున్న సందర్భంగా ఈ వార్షికోత్సవం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

అత్యున్నత నాణ్యత గల ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలపై దృష్టి సారించిన ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్ మరియు పిఎస్‌యు డెట్ ఫండ్ ప్రధానంగా బ్యాంకులు, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (పి.ఎస్.యులు), ఆర్థిక సంస్థలు మరియు ఎంపిక చేసిన మునిసిపల్ కార్పొరేషన్లు జారీ చేసే డెట్ సెక్యూరిటీలలో పెట్టుబడులు పెడుతుంది. ఈ వ్యూహం ద్వారా, తక్కువ క్రెడిట్ రిస్క్‌ను కొనసాగిస్తూ, పెట్టుబడిదారులకు మెరుగైన రాబడులను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. "అత్యుత్తమ నాణ్యత గల, తక్కువ క్రెడిట్ రిస్క్ కలిగిన డెట్ ఇన్‌స్ట్రుమెంట్ల పోర్ట్‌ఫోలియో ద్వారా స్థిరమైన ఆదాయాన్ని అందించే పథకంలో, ఏడాది కంటే ఎక్కువ కాలం తమ అదనపు నిధులను పెట్టుబడి పెట్టాలనుకునే ఇన్వెస్టర్లకు ఈ ఫండ్ అనుకూలంగా ఉంటుంది" అని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్ కు చెందిన చాందిని గుప్తా అన్నారు. ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్ మరియు పిఎస్‌యు డెట్ ఫండ్ ఇన్వెస్టర్లకు అనుకూలమైన పలు ప్రత్యేకతలను అందిస్తోంది. ఇందులో ఎంట్రీ లేదా ఎగ్జిట్ లోడ్ లేకపోవడం వల్ల, ఇది మరింత సౌకర్యవంతమైన పెట్టుబడి ఎంపికగా ఆకర్షణీయంగా నిలుస్తోంది. కనీస పెట్టుబడి మొత్తం రూ.5,000గా నిర్ణయించబడగా, తదుపరి పెట్టుబడులు రూ.1 గుణాకారాల్లో పెట్టే అవకాశం ఉండటంతో, విస్తృత శ్రేణి ఇన్వెస్టర్లకు ఇది సులభంగా అందుబాటులో ఉంటుంది. వడ్డీ రేట్ల మారుతున్న కాలచక్రాల మధ్య కూడా స్థిరత్వాన్ని కోరుకునే ఇన్వెస్టర్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, ఫ్రాంక్లిన్ ఇండియా బ్యాంకింగ్ మరియు పిఎస్‌యు డెట్ ఫండ్, ఇటీవలి కాలంలో స్థిరమైన ఆదాయం, మూలధన పరిరక్షణ మరియు నిరంతర పనితీరును లక్ష్యంగా పెట్టుకున్న వారికి ఒక వివేకపూర్వక పెట్టుబడి ఎంపికగా ప్రత్యేకంగా నిలుస్తోంది.



## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత: కెఎం.ప్రతాప్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కెఎం.ప్రతాప్ పేర్కొన్నారు. మంగళవారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధి కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో నెలకొని ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ... ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు . ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలిగించాలని వేడుకున్నానన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్ సింగ్, కుత్బుల్లాపూర్ గ్రామ సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, ఉపాధ్యక్షులు గోపగోని నరహరిగౌడ్, కోశాధికారి రత్నం, మురళిగౌడ్, సలహాదారులు గోపాలకృష్ణ ఆచార్య, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, నార్ల కంటి ఎట్టయ్య, కెయల్.చారి, గొరిగే సత్తయ్య, హనుమాన్ భక్త మండలి సభ్యులు, కుత్బుల్లాపూర్ గ్రామవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డా ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

### -టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి స్పష్టం.

### -కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన కమిటీ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం లో నిర్మల జగ్గారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా అబ్జర్వర్ రాజ బద్రయ్య




సంగారెడ్డి ప్రతినిధి మే12( ప్రజా కలం):

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు వుంటుందని అన్నారు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి. మంగళవారం సంగారెడ్డి పట్టణం లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన కార్యవర్గ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఎస్సీ సెల్ కమిటీ ఉమ్మడి మెదక్ జిల్లా అబ్జర్వర్ రాజ బద్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్ట పడ్డ వారికి గుర్తింపు ఇవ్వడం లో భాగంగానే పార్టీ కమిటీ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, సురేష్ షెట్కార్ మరియు జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతల సలహాలు, సూచనలతో ఎస్సీ సెల్ నూతన కమిటీ ఏర్పాటు ఉంటుందని, అర్హులైన కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.


ఈ కార్యక్రమం లో టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, జిల్లా నాయకుడు చిదృప్ప రఘు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హనుమంతు యాదగిరి, ఉపాధ్యక్షుడు గంగేరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఇంకా దొరకని కల్పన ఆచూకీ

హైదరాబాద్ : విశ్రాంత ఐపీస్ వినయ్ రంజన్ రే భార్య హత్య కేసులో మూడు రోజులు గడుస్తున్నా నిందితుల ఆచూకీ లభించలేదు. పూణేలో ఉన్న పనిమనిషి కల్పన తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని వారి ద్వారా ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. బెంగుళూరులో ఉంటున్న కల్పన భర్తకు కూడా ఈ దోపిడీ గురించి సమాచారం ఉన్నట్లు గుర్తించి అతని కోసం గాలిస్తున్నారు. నిందితురాలు గతంలో పనిచేసిన మధ్యప్రదేశ్, లఖ్నవూ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరంలో పని చేసిన పలు ప్రాంతాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రంజన్ రే భార్య తనూజ ఎక్కడ పడుకుంటుందని, నగలు, నగదు ఎక్కడ పెడుతుందని పక్కా సమాచారంతో కల్పన దోపిడీకి ప్లాన్ చేసిందని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు.

## ఉమెన్స్ కళాశాల లో సైన్స్ బ్లాక్ ను ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి.

### పాల్గొన్న కార్పొరేషన్ చైర్మెన్ లు కాల్వ సుజాత, మెట్టు సాయి కుమార్.





సంగారెడ్డి ప్రతినిధి 12 (ప్రజా కలం):

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం(కోటి ఉమెన్స్ కళాశాల) లో నూతనంగా నిర్మించిన సైన్స్ బ్లాక్ ను మంగళవారం ప్రారంభించారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం లో నిర్మలా జగ్గారెడ్డి తో పాటు కార్పొరేషన్ చైర్మెన్ లు కాల్వ సుజాత, మెట్టు సాయి కుమార్ లు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక కోటి మహిళా విశ్వవిద్యాలయంలో నూతన సైన్స్ బ్లాక్‌ను టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. మహిళా విద్యార్థినులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించే లక్ష్యంతో, ఈ నూతన బ్లాక్‌లో ఆధునిక ల్యాబ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. కోటి ఉమెన్స్ కాలేజీని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మారుస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మార్పులో భాగంగానే కళాశాలలో విద్యా ప్రమాణాలను పెంచడానికి కొత్త భవనాల నిర్మాణాలను చేపడుతున్నారు ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినుల అభివృద్ధికి మరియు మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రాముఖ్యతను వివరించారు. మహిళా విద్యలో కోటి ఉమెన్స్ కళాశాలకున్న విశిష్ట చరిత్రను గుర్తుచేశారు. ప్రభుత్వం మహిళా విశ్వవిద్యాలయంగా దీనిని అప్‌గ్రేడ్ చేయడం ద్వారా మరిన్ని నిధులు, మౌలిక వసతులు సమకూరుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, రిజిస్ట్రార్ మరియు ఇతర బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

## పాలీసెట్-2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### -మే 13న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష.




సంగారెడ్డి, ప్రతినిధి మే 12:( ప్రజా కలం):

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పాలీసెట్-2026 పరీక్షకు సంగారెడ్డి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి దేవి తెలిపారు. ఈ నెల 13వ తేదీ బుధవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణం మరియు జోగిపేట్‌లో ఏర్పాటు చేసిన మొత్తం 6 పరీక్ష కేంద్రాలలో 2,068 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మహిళా), సంగారెడ్డి సెయింట్ ఆంథోనీ హై స్కూల్, విద్యానగర్, సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల (గర్ల్స్), సంగారెడ్డి ఎస్.వి. జూనియర్ కాలేజ్, రాజంపేట రోడ్, సంగారెడ్డి ప్రభుత్వ హై స్కూల్ ఫర్ బాయ్స్, అప్పర్ బజార్, ఓల్డ్ బస్టాండ్, సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శివంపేట్ (జోగిపేట్) విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 9:30 గంటలకల్లా చేరుకోవాలని సూచించారు. ఉదయం 10:00 గంటల నుండి మాత్రమే పరీక్ష కేంద్రాలలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. ఉదయం 11:00 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు. విద్యార్థులు ఇటీవల డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అలాగే హెచ్‌బీ పెన్సిల్, బాల్ పాయింట్ పెన్, ఎరేజర్, షార్పనర్ వెంట తీసుకురావాలని ఆమె తెలిపారు.



## కామ్రేడ్ రాజా కు శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికిన సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి

మహేశ్వరం, మే 12,(ప్రజా కలం)

సిపిఐ అఖిలభారత కార్యదర్శి కామ్రేడ్ రాజా కు శంషాబాద్ విమానాశ్రయంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి స్వాగతం పలికారు. సిపిఐ జాతీయ కార్యదర్శి డి అనే రాజా నేడు శంషాబాద్ విమానాశ్రయానికి ఢిల్లీ నుండి వచ్చిన సందర్భంగా స్వాగతం పలుకుతున్న సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు శేర్లింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి జై చందు యాదవ్ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి తదితరులు అని రాజాకు స్వాగతం పలికారు.

# అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

### బడంగ్‌పేట్ సర్కిల్--16లో అక్రమ వెంచర్లపై కఠిన చర్యలు

### డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య టౌన్ ప్లానింగ్ ఏసీపీ కిరణ్ కుమార్



మహేశ్వరం, మే 12,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం బడంగ్‌పేట్ సర్కిల్--16 పరిధిలోని బాలాపూర్ ప్రాంతంలోని సర్వే నెంబర్లు 9, 10, 11లలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌పై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. అక్రమ వెంచర్‌లో ఏర్పాటు చేసిన స్తంభాలు, భూగర్భ నీటి ట్యాంకులు, విద్యుత్ స్తంభాలను తొలగించడంతో పాటు అక్రమంగా వేసిన అంతర్గత రోడ్లను ధ్వంసం చేయడం జరిగింది. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను అక్రమంగా వెంచర్లుగా మార్చి ప్లాట్ల విక్రయాలకు ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత అనుమతులు, లేఅవుట్ ఆమోదాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.

అక్రమ వెంచర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు మోసపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, భవిష్యత్తులో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అందువల్ల అనుమతులు లేని వెంచర్లలో ఎవరూ పెట్టుబడులు పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ఎక్కడైనా అక్రమ లేఅవుట్లు లేదా అనుమతులు లేని వెంచర్లు గుర్తించిన వెంటనే మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలు, అనధికార లేఅవుట్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి పి ఓ దినేష్ పాల్గొన్నారు.

## రాయపోల్‌లో చలివేంద్రం ప్రారంభించిన పల్పనూరి ప్రభాకర్ రెడ్డి.

సిద్దిపేట ప్రజాకలం మే 12.

రాయపోల్ మండల కేంద్రంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పల్పనూరి ప్రభాకర్ రెడ్డి



మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రయాణికులు, కార్మికులు, సాధారణ ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సేవలో ముందుంటుందని పేర్కొన్నారు.

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు, స్థానిక ప్రజలు లాభపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిష్టారెడ్డి, ఉషనగల్ల స్వామి, నర్సింగరావు, యూసుఫ్, నాగేశ్వరరావు, వెంకట్, స్వామి, అశోక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం

హైదరాబాద్ : బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇంకా ఎందుకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోంశాఖను దగ్గర పెట్టుకున్న రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయమా? జరిగిన ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలి.

# మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


### బార్డర్ ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలి- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



సంగారెడ్డి, ప్రతినిధి మే 12: ( ప్రజాకలం):

జిల్లాలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు, ఎస్‌డీపీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, సహకార, పౌరసరఫరాలు, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, డీఆర్‌డీవో తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నారాయణఖేడ్, జహీరాబాద్, ఆందోల్ మండలాల్లో మొక్కజొన్న పంట సాగైందని, జిల్లాలో సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 10 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వెంటనే మొక్కజొన్నలు కొనుగోలు చేసి రైతులకు నిర్ణీత సమయంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు, ఎస్‌డీపీవోలు సమన్వయంతో మానిటరింగ్ చేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సరిహద్దు ప్రాంతాల ద్వారా ఇతర రాష్ట్రాల ధాన్యం లేదా మొక్కజొన్న జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. గోదాముల వద్ద రెవిన్యూ, పోలీసు శాఖల నుంచి ఒక్కో అధికారిని ప్రత్యేక పర్యవేక్షణకు నియమించాలని సూచించారు. వాహనాలు గంటల తరబడి నిల్వ ఉండకుండా ఐదు నుంచి ఆరు గంటలలోపు అన్లోడింగ్ చేయాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రతిరోజూ 7 నుంచి 8 వేల మెట్రిక్ టన్నుల లక్ష్యంతో కొనుగోళ్లు జరగాలని పేర్కొన్నారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తైన అనంతరం మిల్లర్ అక్నాలెడ్జ్‌మెంట్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కొన్ని రైస్ మిల్లుల్లో ధాన్యం అన్లోడింగ్ ఆలస్యం చేస్తున్న విషయంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్లు ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకుని రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని హెచ్చరించారు. రైతుల ఆరు నెలల కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేసి సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ధాన్యం రవాణా చేస్తున్న వాహనాలు, డ్రైవర్ల ఫోన్ నంబర్ల వివరాలను తప్పనిసరిగా అందజేయాలని రవాణా కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణ పై ముఖ్యమంత్రి సమీక్ష వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి




రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ మే 12,(ప్రజా కలం)

మంగళవారం రబీ 2025-26 మక్కజొన్న కొనుగోలు మరియు వరి ధాన్యం సేకరణపై గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, దనసరి అనసూయ, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు తో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో బాధ్యత, జవాబుదారీతనం స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలన్నారు. ధాన్యం రవాణా వేగవంతం చేయడానికి రవాణా శాఖ కమిషనర్ సహకారంతో మరిన్ని వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలి, హమాలీలను అవసరమైన సంఖ్యలో నియమించి, వారికి తగిన పారితోషికం చెల్లించాలని సూచించారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనులు వేగంగా జరిగేలా చూడాలి, ప్రతి కొనుగోలు కేంద్రానికి బాధ్యతాయుత అధికారిని నియమించి, పూర్తి బాధ్యత కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించకుండా స్థానిక హమాలీల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లర్ల నుంచి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. లారీలపై మాత్రమే ఆధారపడకుండా, సమీప ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను కూడా వినియోగించాలని అన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలలో మరిన్ని టార్పాలిన్లను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్రత్యేక అధికారిని నియమించి, అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా అధికారులు ప్రతిరోజూ కొనుగోలు ప్రక్రియపై నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రతిరోజూ సమీక్షిస్తూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనుల్లో జాప్యం జరిగితే లేదా రైతులు ఆందోళనలు చేపడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలన్నారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలి, ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దు, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు, ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్ ను ఆదేశించారు.సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందేనని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదన్నారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్ ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్ కు తరలించేలా ప్రణాళికలుండాలి. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలాచూడాలి. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్ కు రిపోర్ట్ పంపించాలి. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, పిడి డీఆర్డీఏ శ్రీలత, డీసీసీఓ సుధాకర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు సెమిస్టర్ విధానం?

హైదరాబాద్ : తెలంగాణ విద్యా విధానం కమిటీ రాష్ట్రంలో 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. వార్షిక పరీక్షల వల్ల విద్యార్థులపై పడే ఒత్తిడిని తగ్గించి, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై శ్రద్ధ చూపేలా ఈ మార్పు చేయనున్నారు. థియరీ కంటే ప్రాక్టికల్స్‌కు, అనుభవపూర్వక అభ్యసనానికి ప్రాధాన్యతనిస్తూ, పాఠశాల విద్యలో ఇంటర్‌ను విలీనం చేసే అంశాన్ని కూడా కమిటీ పరిశీలిస్తోంది. తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో చారిత్రాత్మక మార్పులకు సర్కార్ సిద్ధమవుతోంది. ప్రస్తుతమున్న వార్షిక విద్యా విధానం స్థానంలో.. ఉన్నత విద్య (యూజీ/పీజీ) తరహాలోనే పాఠశాల స్థాయిలోనూ సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే దిశగా తెలంగాణ విద్యా విధానం కమిటీ సభ్యులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి నుంచి ప్రారంభించి పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు ఈ నూతన విధానాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీనివల్ల విద్యార్థులు ఏడాది పొడవునా సిలబస్ మొత్తాన్ని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. సిలబస్‌ను రెండు భాగాలుగా విభజించి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక విధానంలో విద్యార్థులు పరీక్షలకు కొద్ది నెలల ముందు మాత్రమే పుస్తకాలు పట్టే ధోరణి కనిపిస్తోంది. అలాగే, మార్చి, ఏప్రిల్ నెలల్లో భారీ సిలబస్‌ను పునశ్చరణ చేయడం విద్యార్థులకు సవాలుగా మారుతోంది. సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై దృష్టి సారిస్తారు. మొదటి సెమిస్టర్‌లో సాధించిన ఫలితాలను బట్టి ఉపాధ్యాయులు విద్యార్థుల బలహీనతలను గుర్తించి రెండో సెమిస్టర్ నాటికి వారిని మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా ఈ విధానానికి సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒకవేళ స్కూల్ స్థాయిలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే తొలుత ఇంటర్మీడియట్‌కైనా ఈ విధానాన్ని వర్తింపజేయాలని కమిటీ భావిస్తోంది.

# తెలంగాణలో పెరగనున్న భూముల విలువ



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను మే 26 నుంచి సవరించాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ధరలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని ప్రజలు పోటీ పడుతుండటంతో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను పొడిగించింది. ముఖ్యంగా హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లోని 15 ప్రధాన కార్యాలయాల్లో ఉదయం 9.30 నుండి సాయంత్రం 6.30 వరకు సేవలు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తుల మార్కెట్ విలువలను పెంచాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఒక్కసారిగా బిజీ అయిపోయింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత భూముల విలువలను 20 శాతం నుండి 100 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నూతన ధరలు మే 26 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉండటంతో పాత ధరలకే తమ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని సామాన్యుల నుంచి బిల్డర్ల వరకు అందరూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఈ భారీ రద్దీని క్రమబద్ధీకరించేందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఈ నెల 12 నుంచి 15 వరకు ఎంపిక చేసిన 15 ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పనివేళలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నాలుగు రోజుల పాటు కార్యాలయాలు ఉదయం 9.30 గంటలకే తెరుచుకుని సాయంత్రం 6.30 గంటల వరకు నిరంతరాయంగా పనిచేస్తాయి. రద్దీ ఎక్కువగా ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలి పురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్ నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలని, తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను పెంచాలని, సర్వర్లపై ఒత్తిడి పడకుండా సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతును ఆదేశించారు. ఒకవేళ నిర్ణీత గడువు తర్వాత కూడా రద్దీ తగ్గకపోతే పనివేళలను మరింత పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అలాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా ఇదే విధమైన సమన్వయం ఉండాలని కోరారు. భూముల మార్కెట్ విలువల సవరణ వల్ల ప్రభుత్వం ఈ ఏడాది సుమారు రూ. 19 వేల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. కొకపేట్, గండిపేట్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రభుత్వ ధర కంటే మార్కెట్ ధరలు చాలా ఎక్కువగా ఉండటంతో ఈ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో రేట్లను సవరిస్తోంది.

# ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి

## రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
## దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు
## జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి




రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ 12, (ప్రజా కలం)

దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కు, సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో దక్షిణ తెలంగాణా స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, దక్షిణ తెలంగాణా జిల్లాల నుండి విచ్చేసిన అదనపు కలెక్టర్లు తమ తమ జిల్లాలలో స్థానిక సంస్థల పని తీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి, అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు, చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగు పర్చడం, స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని అన్నారు. స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు. ఈ సదస్సులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కిరణ్మయి, దక్షిణ జిల్లాల అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జి.ఫణీంద్ర రెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ సీ.ఈ.ఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కమిషనర్ లు, డిపిఒలు, డీఎల్పీఓలు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా ప్రజ్ఞాపూర్ లో అన్నదాన కార్యక్రమం

## హనుమాన్ జయంతి శుభాకాంక్షలు - ప్రజ్ఞాపూర్ రజక సంఘం అధ్యక్షులు మెతుకు నర్సింలు

గజ్వేల్:12 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

హనుమాన్ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ లో మంగళవారం ప్రజ్ఞాపూర్ రజక సంఘం అధ్యక్షులు మెతుకు ( టెంట్) నర్సింలు



ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు, హనుమాన్ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని, కోరుకుంటూ హనుమాన్ స్వామిని ప్రత్యేకంగా పూజించి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని,మానవ సేవే మాధవ సేవ అని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని. ఈకార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు

# ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

## కన్నుల పండుగగా అమ్మవారి కల్యాణ మహోత్సవం

గజ్వేల్ :12 మే 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం కుకునూరు పల్లి మండల కేంద్రంలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవ




వేడుకలు ఘనంగా నిర్వహించి,రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు నర్సింలు గౌడ్ మాట్లాడుతూ,ఆలయ వార్షికోత్సవ వేడుకలు సహకరించిన ప్రతి ఒక్కరికి అమ్మవారి అనుగ్రహం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లం కనుకవ్వ ఐలయ్య,మాజీ సర్పంచ్ లు కాసం నవీన్, జయంతి నరేందర్,గౌడ సంఘం అధ్యక్షుడు దూరవైన నర్సింలు గౌడ్ ఉపాధ్యక్షుడు పాల శేఖర్ గౌడ్,కోశాధికారి శివలింగ ప్రభాకర్ గౌడ్,కార్యవర్గ సభ్యులు పాల సంతోష్ గౌడ్,మాందాల మహేష్ గౌడ్,సాద్ పల్లి రాజు గౌడ్, కుకునూర్ పల్లి గౌడ సంఘం సభ్యులు,మహిళలు, చిన్నారులు,యువకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సభలో లక్షల మందిని చూసి బిఆర్ఎస్ వణుకు మొదలైంది

**- మోదీ దేశం భవిష్యత్తు కోసం ఇంధనం ఆదా చేయమంటే తప్పా..?**

**- కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఫామ్ హౌస్ లో పడుకుంటే ఒప్పా..?**

**- వంటేరు ప్రతాప్ రెడ్డి 10 అబద్ధాలకు 10 చెంపదెబ్బలు.. -బిజెపి పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్**

గజ్వేల్:12 మే ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలో మంగళవారం బిజెపి కార్యాలయంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా దేవులపల్లి మనోహర్ యాదవ్ మాట్లాడుతూ బంగారం కొనొద్దు, పెట్రోల్ వాడొద్దని మోదీ అనడం చరిత్రలో మొదటిసారి అనేది పచ్చి అబద్ధం 1967లో ఇందిరా గాంధీ కూడా "బంగారం కొనొద్దు" అన్నారు 1967 జూన్ 6 నాటి ది హిందూ పేపర్ సాక్ష్యం 2013లో నాటి ఆర్థిక మంత్రి చిదంబరం కూడా బంగారం కొనొద్దు అన్నారు 2013 జూన్ 14 టైమ్స్ ఆఫ్ ఇండియా సాక్ష్యం 1973 లో చమురు సంక్షోభంలో ఇందిరా గాంధీ కూడా ఇంధన ఆదా పిలుపు ఇచ్చారు ఇప్పుడు హోర్ముజ్ జలసంధి యుద్ధం వల్ల ప్రపంచ చమురు సరఫరా ఆగిపోయింది. 1500 నౌకలు చిక్కుకుపోయాయి. దేశం కోసం ఆదా చేయమనడం తప్పా ఎగుమతులు తగ్గి



దిగుమతులు పెరిగాయి ఇది పచ్చి అబద్ధం 2014 ఎగుమతులు ₹314 బిలియన్ 2025 ఎగుమతులు ₹825 బిలియన్ రికార్డ్ స్థాయిలో మొబైల్ ఫోన్లు,డిఫెన్స్, ఫార్మా ఎగుమతుల్లో దూసుకుపోతున్నాం మొక్కజొన్న, కాటన్ దిగుమతి చేసుకుంటున్నాం అనేది అబద్ధం 2023-24లో భారత్ వ్యవసాయ ఎగుమతులు ₹51 బిలియన్ కెసిఆర్ టైంలో తెలంగాణలో వరి వేస్తే ఉరి అని వరి కొనలేక రైతులు రోడ్డెక్కిన సంగతి మర్చిపోయారా? తెలంగాణ అప్పు ?6.71 లక్షల కోట్లు 10 ఏళ్లలో 5 రెట్లు పెంచింది ఎవరు కెసిఆర్ కదా మోదీ ఎప్పుడూ ఖాతాలో 15 లక్షలు వేస్తా అనలేదు. విదేశాల్లో ఉన్న నల్లధనం అంతా వెనక్కి తెస్తే ఒక్కొక్కరికి 15 లక్షలు వచ్చేంత ఉంది అని ఉదాహరణగా చెప్పారు వీడియో చూసుకోండి. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాం మోదీ దేశం కోసం ఇంధనం ఆదా చేయమంటే తప్పా కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో పడుకుని రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తే ఒప్పా? ప్రతాప్ రెడ్డి కాళేశ్వరం ?1.2 లక్షల కోట్లు పెట్టి కట్టింది ఎవరు? 3 పిల్లర్లు కూలితే రిపేర్ చేసింది ఎవరు? దళిత బంధు పేరుతో మోసం చేసింది ఎవరు టిఎస్పిఎస్సి పేపర్ లీక్ చేసి లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు నాశనం చేసింది ఎవరు? ఫోన్ ట్యాపింగ్ కేసు లో మీ బిఆర్ఎస్ నేతలు దొరికింది నిజం కాదా గజ్వేల్‌లో 40 రోజులుగా పొద్దు తిరుగుడు కొనలేదని రైతులు ఏడుస్తుంటే మీరు ఏం చేస్తున్నారు గజ్వేల్ లో ఎన్నో పెండింగ్ పనులు రింగ్ రోడ్డు అసంపూర్తి,ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజల సమస్యలపై,ఇలా అనేక మైనటువంటి సమస్యలపై మీరు నోరు ఎందుకు మెదపడం లేదు గజ్వేల్ లో నర్సారెడ్డి తో కుమ్మక్కు రాజకీయాలు చేస్తుంది మీరు గజ్వేల్ పట్టణంలో ప్రజ్ఞాపూర్ ఊర చెరువు పక్కన వెంచర్ నిర్మాణం చేసి అమాయకులైనటువంటి ప్రజల చేత ప్లాట్లు కొని పిచ్చి ఇప్పటికీ ఆ సమస్యను పరిష్కారం చూపకపోగా మీరు నరేంద్ర మోడీ గురించి మాట్లాడడం సిగ్గుచేటు మోడీని విమర్శించే అర్హత నీకు లేదు అని తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్,బిజెపి జిల్లా నాయకులు నత్తి శివకుమార్,చేప్యాల వేంకట్ రెడ్డి,గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్,బిజెపి నాయకులు మంద వెంకట్,శ్రీరాం కృష్ణ,కదుల్ల ఎల్లేశం,మంగళ్ళపల్లి సత్యనారాయణ, కదుల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురు అరెస్ట్..

# కుల దూషణలను సహించం

## : ఏసీపీ కే. నర్సింలు జంగంరెడ్డిపల్లి ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురు అరెస్ట్.

గజ్వేల్ నియోజకవర్గం:12మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో కులం పేరుతో దూషించి, చెప్పులతో దాడి చేసిన ఘటనకు సంబంధించి నమోదైన ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గజ్వేల్ ఏసీపీ కె.నర్సింహులు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులైన బోయిని పోచయ్య, బోయిని భాస్కర్,రుద్రారం గణేష్‌లను మే 12న అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా ఏసీపీ కె. నర్సింహులు మాట్లాడుతూ కులం లేదా మతం పేరుతో దూషించడం,దాడులకు పాల్పడడం వంటి చర్యలను పోలీసులు ఏమాత్రం సహించరని తెలిపారు. నేరస్థులు ఎంతటి వారైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కుల,మత భేదాలను విడనాడి సోదరభావంతో మెలగాలని, వివాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని సూచించారు.




# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

## అంగడిపేట్ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష తమలపాకులతో అర్చన

గజ్వేల్ :12 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట ఆంజనేయ స్వామి ఆలయ అర్చకులు విఠల మురళి మోహన్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విఠల మురళి మోహన్ శర్మ మాట్లాడుతూ అందరికీ ఆంజనేయ స్వామి అనుగ్రహం ఉండాలని కోరుకుంటూ హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి,స్వామివారికి అత్యంత ఇష్టమైన తమలపాకులతో అర్చన చేయడం వల్ల కోరిన కోర్కెలు నెరవేరుతాయని,ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు చేకూరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుడాల దామోదర్, దుబకుంట లక్ష్మణ్, కైలాస శ్రీనివాస్, బెజుగామ రాము,విజయ్, ప్రభాకర్, శ్రీహరి,కాపర్తి వైకుంఠం,కైలాస ప్రశాంత్,షేర్ల నర్సింలు,బైరి రవి, ఆర్యవైశ్య సీనియర్ నాయకులు భద్రయ్య, అయప్ప శ్రీనివాస్,నోముల మహేందర్,హనుమాన్ భక్త బృందం, సబ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు



# ఆదర్శ డివిజన్ గా ముత్తంగి

## ముత్తంగిలో 84 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..

పటాన్ చేరు మే 12 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు ముత్తంగి డివిజన్ ను అన్ని రంగాల్లో ఆదర్శంగా



తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు మంగళవారం డివిజన్ పరిధిలోని డి ఎస్ కాలనీ, సాయి ప్రియా కాలనీ, పార్థ కాలనీలలో 84 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యుజిడి నిర్మాణ పనులకు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కాలనీలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈ ఈ సురేష్, డిఈ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, కుమార్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కిట్టు, అమ్జాద్, ఆయా కాలనీల అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైల్వే చీఫ్ ఇంజనీర్ ను కలిసిన జలమండలి అధికారుల



మల్కాజిగిరి,మే12 (ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు రైల్వే చీఫ్ ఇంజనీర్ సదర్మ రాయల్,డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ గణేషన్ ను హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు,బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గౌతమ్ నగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద 42 కోట్లతో నిర్మించనున్న ఆర్ యు బి నిర్మాణం కోసం స్టామ్ వాటర్ పైప్ లైన్ ఏర్పాటు,డ్రైనేజీ నిర్మాణం ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీజీఎం శ్రీనివాస్ రెడ్డి,జీ.ఎం.సునీల్ మేనేజర్ నవీన్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ తదితరులున్నారు.

# వెస్ట్ హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మల్కాజిగిరి,మే12,(ప్రజా కలం ప్రతినిధి)

నూతనంగా ఏర్పడిన వెస్ట్ హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం 186 మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల



వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ ప్రెసిడెంట్ నరసింహ, చైర్మన్ నాగేంద్ర రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్,జనరల్ సెక్రెటరీ మల్లేష్ తో పాటు మిగతా కోర్ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి 186 మౌలాలి డివిజన్ ప్రెసిడెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, మరియు ఇతర కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉస్మాన్,షకిల్,భీమ్రాజ్, పాండురంగ చారి,సలీం,ఇతర నాయకులు యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్,లక్ష్మణ్,నాని, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్ చేరుకున్న విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

సింగపూర్ :విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్ చేరుకున్నారు. అయన ప్రవాసాంధ్రులు స్వాగతం పలికారు. రాయల్ ఎన్ఫీల్డ్ కంపెనీ రాష్ట్రానికి తీసుకొచ్చినందుకు లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. లోకేష్ మాట్లాడుతూ మీరంతా రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లు గా మారాలి. మీరు పనిచేస్తున్న కంపెనీల్లో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, వస్తున్న పెట్టుబడుల కోసం మాట్లాడాలని అన్నారు.

# బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

సాగర్ : పోక్సో కేసు బాధితురాలైన 17 ఏళ్ల మైనర్ బాలిక వ్యక్తిత్వం గురించి కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను ఖండిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా పట్టణంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేసారు.

బండి సంజయ్ను వెంటనే అరెస్ట్ చేసి మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు.




# నర్సుల సేవలు వెలకట్టలేనివి

### : సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

### -గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

గజ్వేల్: 12 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ కేంద్ర జిల్లా ఆసుపత్రి నందు మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని (వరల్డ్ నర్సెస్ డే) పురస్కరించుకొని నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలకు జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ముఖ్యఅతిథిగా హాజరై,జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ సమాజంలో నర్సుల సేవలు అనన్యసామాన్యమని కొనియాడారు. ఒక అమ్మగా,అక్కగా, చెల్లిగా రోగులకు తోడూంటూ, రేయింబవళ్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా,నిస్వార్థంగా, అంకితభావంతో సేవలు అందించడం చిరస్మరణీయం అని, నర్సుల ఆత్మస్థైర్యం, వారు చూపే ప్రేమ రోగుల త్వరితగతిన కోలుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ అఫ్ స్నేహ ఉపాధ్యక్షులు లయన్ డాక్టర్ కుమారస్వామి పాల్గొని వారు మాట్లాడుతూ నర్సింగ్ ఆఫీసర్ సేవలు అభినందనీయం అన్నారు. అనంతరం ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆర్.ఎం.ఓలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రణీత,నర్సింగ్ అధికారులు హెడ్ నర్సులు ఉమా,రోజులిన్, ఉమామహేశ్వరి, వకుళాదేవి,నిర్మల, పుష్ప,నర్సింగ్ ఆఫీసర్లు వరలక్ష్మి,శశికళ,షబానా సప్న, షాహిని, నజీర్, కవిత, ఉజ్మ,రేఖ,రమేష్, రచన,జీవన,సాంకేతిక మరియు ఇతర సిబ్బంది ఎక్స్రే టెక్నీషియన్లు అయేషా,మమత, సిబ్బంది పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో లీలా ప్రసాద్ కు పీహెచ్.డీ.

పటాన్ చేరు మే 12 (ప్రజాకాలం) ప్రతినిధి

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి లీలా ప్రసాద్ కౌతారపు డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ద్రవ ఔషధ మోతాదు రూపాల నాణ్యతను అంచనా వేయడానికి డిజైన్ ద్వారా నాణ్యత దృష్ట్యా హరిత విశ్లేషణాత్మక పద్ధతి అభివృద్ధి' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రత్నమాల మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

డాక్టర్ లీలా ప్రసాద్ డాక్టరల్ పరిశోధన, ఔషధ ద్రవ ఫార్ములేషన్ల కోసం సుస్థిరమైన, విశ్వసనీయమైన హరిత క్రోమెటోగ్రాఫిక్ విశ్లేషణాత్మక పద్ధతులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం, ఔషధ విశ్లేషణలో పటిష్టత, విశ్వసనీయతను నిర్ధారించడానికి క్వాలిటీ బై డిజైన్ (క్యూబీడీ) సూత్రాలను ఏకీకృతం చేస్తూ, మెరుగైన కచ్చితత్వం, ఎంపిక సామర్థ్యం, సున్నితత్వం, పునరుత్పత్తి సామర్థ్యం ద్వారా విశ్లేషణాత్మక రసాయన శాస్త్రాన్ని ముందుకు తీసుకువెళ్లిందని పేర్కొన్నారు ఈ పరిశోధన, సెరోటోనిన్ రిసెప్టర్ యాంటాగోనిస్ట్ ఫార్ములేషన్లు, మాస్ట్ సెల్ స్టెబిలైజర్లు, హిస్టమైన్ రిసెప్టర్ యాంటాగోనిస్టులు, లింకోసమైడ్ యాంటీబయాటిక్ ఇంజెక్టబుల్స్ విశ్లేషణలో, యాంటీబయాటిక్ లిక్విడ్ ఫార్ములేషన్లలో క్యాన్సర్ కారక, జన్యు విషపూరిత



మలినాలను అతి తక్కువ స్థాయిలో నిర్ధారించడంలో, అలాగే ఫిజియోలాజికల్ ద్రావణాల స్థిరత్వ అధ్యయనాలలో గణనీయమైన తోడ్పాటును అందించినట్టు వివరించారు. ఈ అధ్యయనం, సుస్థిరమైన, వినూత్నమైన ఔషధ విశ్లేషణాత్మక పద్ధతుల దిశగా ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తోందన్నారు డాక్టర్ లీలా ప్రసాద్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


### సభ్యత్వ నమోదు మరింత ఆధునికంగా

# డిజిటల్ విధానానికి బీఆర్ఎస్ శ్రీకారం

### కేసీఆర్ సమక్షంలో సుదీర్ఘంగా సాగిన ప్రధాన కార్యదర్శుల సమావేశం

గజ్వేల్ నియోజకవర్గం:12 మే ( ప్రజా కలం ప్రతినిధి)

చంద్రశేఖర్ రావు అధ్యక్షతన మంగళవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శుల సమావేశం కీలక నిర్ణయాలకు వేదికైంది. గజ్వేల్ నియోజకవర్గం లోని మర్కుక మండలంలోని ఎర్రవల్లి గ్రామంలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ సమావేశం దాదాపు ఆరు గంటల పాటు కొనసాగింది. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ముఖ్యంగా సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో చేపట్టడంపై విస్తృతంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలు ఇప్పటికే డిజిటల్ విధానంలో కొనసాగుతున్న నేపథ్యంలో, పార్టీ సభ్యత్వ నమోదును కూడా సాంకేతికత ఆధారంగా నిర్వహించాలని సమావేశం అభిప్రాయపడింది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిజిటల్ సభ్యత్వ నమోదు వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గానికి రాష్ట్ర కమిటీ నుంచి ప్రత్యేక సభ్యత్వ సమన్వయకర్తను నియమించాలని సమావేశం తీర్మానించింది. అదేవిధంగా ప్రతి మండలం, మున్సిపాలిటీ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సభ్యత్వ సమన్వయ కమిటీలను రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 35,655 పోలింగ్ బూత్‌లలో ప్రతి బూత్‌కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో డిజిటల్ మెంబర్‌షిప్ నమోదు విధానం, సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా వేగవంతం



చేయాలని నిర్ణయించారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నియమితులైన ఇంచార్జీలు

ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు -- తక్కళ్లపల్లి రవీందర్ రావు

జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలు -- జీవన్ రెడ్డి

ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలు -- సత్యవతి రాథోడ్

జనగాం, హనుమకొండ, వరంగల్ జిల్లాలు -- పల్లా రాజేశ్వర్ రెడ్డి

మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాలు -- గ్యాదరి బాలమల్లు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు -- గంగాధర్ గౌడ్

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలు -- నారదాసు లక్ష్మణ్ రావు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు -- రావుల శ్రావణ్ కుమార్ రెడ్డి వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు -- సబితా ఇంద్రారెడ్డి

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలు -- మహమూద్ అలీ గద్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు -- మెట్టు శ్రీనివాస్ మేడ్చల్–మల్కాజిగిరి, యాదాద్రి జిల్లాలు -- పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ జిల్లా -- తలసాని శ్రీనివాస్ యాదవ్

నల్గొండ, సూర్యాపేట జిల్లాలు -- ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్.

# మైనర్ బాలికకు న్యాయం చేయాలి

## మహమ్మద్ సుల్తాన ఉమర్.

సిద్దిపేట ప్రజాకలం మే 12.

మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ డిమాండ్ చేశారు. ఈ కేసులో బలహీనమైన సెక్షన్లు నమోదు చేసి కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆమె ఆరోపించారు. పోక్సో చట్టంలోని సెక్షన్లు 7, 8 కింద కేసు నమోదు చేయాల్సిన చోట 11, 12 సెక్షన్లు నమోదు చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కేసు నమోదు అయి ఐదు రోజులు గడిచినా నిందితుడిని అరెస్టు చేయకపోవడం



సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని కోరుతూ, బాధిత మైనర్ బాలికకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత తెలంగాణలో ప్రశ్నార్థకంగా మారిందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు పోరాటం కొనసాగిస్తాయని హెచ్చరించారు.

# సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### పటాన్చెరు డివిజన్ లో 2 కోట్ల 19 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు.

పటాన్ చేరు మే 12 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని సబ్బండ వర్గాల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం



మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో ఒక కోటి రూపాయల అంచన వ్యయంతో చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు మంగళవారం ఉదయం శంకుస్థాపన చేశారు. అనంతరం ఒక కోటి 19 లక్షల రూపాయలతో నిర్మించిన నాయి బ్రాహ్మణ సంఘం, ముదిరాజ్ సంఘం, ఎస్సీ సంఘం స్మశాన వాటికల ప్రహరీ గోడలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈఈ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, డిఈ కృష్ణవేణి, బి ఆర్ ఎస్ ఆర్ పార్టీ సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, శ్యామ్, ఎట్టయ్య, వెంకటేష్, శంకర్, రామ్మోహన్, షకీల్, ఆయా కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సౌదీ అరేబియాలో చారిత్రాత్మక 'మినీ మహానాడు'

### - పసుపు పండించిన తూర్పు ప్రాంతం!

అమరావతి : 2026 సంవత్సరానికి గాను ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియా?తూర్పు ప్రాంతంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు ఘనవిజయాన్ని సాధించింది. ఈ మహోత్సవాన్ని కోనేరు ఉమామహేశ్వరరావు, వరప్రసాద్ కందిబెడల, సంపత్ కోయ, నాగశేఖర్ చందగాని, నాగేశ్వరరావు బులుసు, ప్రభాకర రెడ్డి, దిలీప్ ,కేవీఎన్ రాజు, శ్రీనివాస్ గుబ్బల, మనోహర్ ప్రసాద్, నిస్సార్ అహ్మద్, శివ సిరిగిన, రాజేంద్ర రెడ్డి, సురేష్ రెడ్డి, రోహిత్ నందా, కిషోర్ ఔఃః, ప్రవీణ్ కోలేటి, రాజ్యలక్ష్మి నందమూరి, శారద కోనేరు, వర్ధిని బులుసు, అనిత నాగశేఖర్, సత్య మల్లిన తదితర నాయకులు, కార్యకర్తల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం తూర్పు ప్రాంతం మొత్తం పసుపు పండించినట్లైంది. సభా ప్రాంగణం అంతా పసుపు రంగుతో అలంకరించబడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# యూపీ గ్యాంగ్ పనే రాబరీ...

కరీంనగర్ : కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాపులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో విచారణ వేగంగా కొనసాగుతోంది. ఈ కేసు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. చోరీ జరిగి ఐదు రోజులైనా దొంగలను పట్టుకోలేదు. కానీ కీలక ఆధారాలను మాత్రం సేకరించారు. ఈ చోరీ తర్వాత పోలీసులు, అధికార పార్టీ నేతలు, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇది పోలీసులపై మరింత ఒత్తిడి పెంచుతోంది. ఈ భారీ దోపిడీ ఒక్కసారిగా తెలంగాణ పోలీసుల అవగాహనను మార్చేసింది. కోట్ల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో ఈ సంఘటన వెనుక బిహార్ మూలాలు కలిగిన ఆరుగురు సభ్యుల అంతర్రాష్ట్ర 'గోల్డ్ థీఫ్' గ్యాంగ్ ఉందని పోలీసులు నిర్ధారించారు. ఈ ముఠా ఉత్తరప్రదేశ్‌లో అనేక కిడ్నాపింగ్ కేసుల్లో చిక్కుకుంది. వారు ధనవంతులను లక్ష్యంగా చేసుకుని డబ్బు వసూళ్లు చేసి, బంగారు దోపిడీల వైపు మళ్లారు. బిహార్ నుంచి తెలంగాణకు వలస వచ్చిన వీరు ధర్మపురి, పెద్దపల్లి ప్రాంతాల్లో లాడ్జీలు బుక్ చేసుకుని వారం రోజులు రెక్కీ నిర్వహించారు. గ్యాంగ్ లీడర్ గతంలో జైలు శిక్ష అనుభవించాడని సమాచారం.

వారి నెట్‌వర్క్ దక్షిణ భారతదేశంలో విస్తరిస్తోంది. దోపిడీ తర్వాత స్థానిక సినిమా ఫక్కీల్లో తమ ఆధారాలు వదిలి వెళ్లారు. ఇది పోలీసుల దృష్టిని స్థానికుల వైపు తిప్పడానికి వ్యూహాత్మక చర్య. ఫోరెన్సిక్ టీమ్ ఈ ఆధారాల నుంచి డీఎన్ఏ, మొబైల్ ట్రాకింగ్ ద్వారా గ్యాంగ్‌ను గుర్తించింది. ఈ టెక్నిక్ వారి సంక్లిష్ట 'రెడ్ హెర్రింగ్' వ్యూహం భాగం. కరీంనగర్ పోలీసులు, బిహార్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కోఆర్డినేట్ అవుతున్నారు. రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు. డ్రోన్‌లు, ఏఐ టూల్స్‌తో గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే రెండు వాహనాలు సీజ్ చేశారు. పోలీసు అధికారి ప్రకారం, 48 గంటల్లోపు అరెస్టులు జరుగుతాయి. గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి గ్యాంగ్ దోపిడీ చేసింది. దక్షిణ భారతదేశంలో బిహార్ ముఠాలు 30 శాతం పెరిగాయి. ఆర్థిక పురోగతితో జ్యువెలరీ లక్ష్యాలు ఎక్కువవుతున్నాయి.

# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ చైర్మన్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, మే 12,(ప్రజా కలం)

హనుమాన్ జయంతి సందర్భంగా అల్మాస్‌గూడ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం లో ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు, వడమాల సమర్పణ, హారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ప్రసన్నాంజనేయ స్వామి టెంపుల్ చైర్మన్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రామిడి కృష్ణారెడ్డి దిండు శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు,పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ హనుమాన్ జయంతి పర్వదినం ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని, శ్రీ ఆంజనేయ స్వామిని భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తే ధైర్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



# ఇండ్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు అవకాశం కల్పించాలి

### -కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె ఎల్ ఆర్ ని కలిసి కోరిన

### -బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, మే 12, (ప్రజా కలం)

మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె ఎల్ ఆర్ ని వారి క్యాంప్ ఆఫీస్ నందు కలవడం జరిగింది. గతంలో ఒకసారి కేఎల్ఆర్ తో కలిసి బాలాపూర్ మండలంలో ఇండ్లు




లేనివారు కొంతమంది ఉన్నారని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి అని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె ఎల్ ఆర్ ని కలిసి అడగడం జరిగింది. ఈరోజు కె ఎల్ ఆర్ గారితో చర్చించగా తప్పనిసరిగా మీరు గతంలో ఇచ్చిన లెటర్ ఆధారంగా మీకు నిజమైన ఇండ్లు లేని నిరుపేదలకు 30 ఇండ్లు మంజూరు చేస్తానని మాట ఇవ్వడం జరిగింది. అందుకు కేఎల్ఆర్ కి బాలాపూర్ మండల సమితి సిపిఐ పార్టీ తరపున కృతజ్ఞతలు. ఈరోజు కేఎల్ఆర్ కలవడానికి వచ్చిన కామ్రేడ్స్ బాలాపూర్ మండల మహిళ ప్రధాన కార్యదర్శి బి. యాదమ్మ, బాలాపూర్ మండల సహాయ కార్యదర్శి రెడ్యా నాయక్, లెనిన్ నగర్ శాఖ కార్యదర్శి పిచిరాజు, ఇంద్రానగర్ శాఖ కార్యదర్శి వీరస్వామి బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

మల్కాజిగిరి,మే12(ప్రజా కలం ప్రతినిధి)

హనుమాన్ జయంతి నీ పురస్కరించుకొని ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వారి ఆలయం లో శ్రీ సంకట విమోచన ఆంజనేయ స్వామి వారి కి మంగళవారం ఉదయం ప్రభాత ఆరాధన , అనంతరం వివిధ ఫల రసాలతో,పంచామృత అభిషేకం, సింధూరాభిషేకంను ఘనంగా నిర్వహించారు అని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రదానా అర్చకులు ముడంబై వెంకట రమణా చార్యులు,అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు ఆధ్వర్యంలో అభిషేకం అనంతరం విశేష అలంకరణ,లక్ష తమలపాకులతో అర్చన కార్యక్రమం ను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహనివేదన,హారతి మంత్ర పుష్పం,తీర్థ ప్రసాద గోష్ఠి అన్నప్రసాదం వితరణ నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ఫల ప్రసాదం ను అందచేశారు.
ఈకార్యక్రమంలో ఆలయ క్లర్క్ సంద్ర సుధాకర్, ఆలయ మాజీ చైర్మన్ ఉమేష్ సింగ్,ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు సానాధి శంకర్,హేమంత్ కుమార్, సంజయ్ కుమార్, శ్రీకాంత్,రవీందర్ రెడ్డి, అనిత గణేష్ ,సురేష్ సింగ్ భక్తులు జోగేశ్ కుమార్, కామేశ్వర రావు,దేవి , లలిత,రేఖ,సుధారాణి, జయశ్రీ,భాను,శ్రీదేవి, శ్రీనివాస్,శ్రీనివాసా చారి, పవన్ తదితరులు పాల్గొన్నారు.




# పేదల ఆరోగ్యానికి ఎంత ఖర్చయినా భరిస్తాం

### - సిఎంఆర్ఎఫ్ చెక్కులతో రోగుల కుటుంబాలకు ఆర్థిక స్వాంతన

### - ప్రభుత్వానికి భారమైనా సీఎం రేవంత్ వెనకడుగు వేయరు

### - మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, మే 12,(ప్రజా కలం)

పేదల ఆరోగ్యానికి భద్రతగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కార్యాలయంలో 50 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను రోగులు, వారి బంధువులకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య చికిత్స తీసుకున్నా సీఎంఆర్ఎఫ్ తో కొంత ఆర్థిక చేయూత అందిస్తున్నామని కె ఎల్ ఆర్ తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థిక భారమైన పేదల వైద్యానికి ఎంత ఖర్చయినా... భరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారు సిద్ధంగా ఉన్నారని కిచ్చెన్నగారు గుర్తు చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందించటం సంతోషమని కాంగ్రెస్ నేతలు, రోగుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక డెస్క్ పెట్టి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించేందుకు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి గారు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు, రోగులు, వారి బంధువులు పాల్గొన్నారు.



# బ్యాంకుకు కన్నం వేసిన ఘనుడు

## బ్యాంకు మేనేజరే దొంగ అయ్యాడు

మెదక్ మే 12(ప్రజాకలం ప్రతినిధి) బెట్టింగ్ మోజు లొ పడి బ్యాంక్ కు ఖనం వేసిన ప్రబుద్ధుడు రూ.1.80 కోట్లు లూటీ ఆదర్శ బ్యాంకును ఆగం చేసిన భార్యభర్తలు. పోలీసులకు చిక్కిన భార్య, పరారీలో భర్త. మెదక్ జిల్లా మెదక్ పట్టణంలో ఆదర్శ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనజర్ ఘరన మోసం చేశాడు. బెట్టింగ్ మోజులో పడి పట్టణ కేంద్రంలోని ఆదర్శ బ్యాంకులో భార్యభర్తలు మరో ఇద్దరితో కలిసి రూ.1.80కోట్లు లూటి చేసిన సంఘటన అలస్యంగా చోటు చేసుకోంది. మెదక్ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించింది. ఈ కేసు పై పూర్తి వివరాలు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్‌లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాకు చెందిన యాదం అనిల్ మెదక్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ కో-- ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అనిల్ బెట్టింగ్ మోజులో నిండి



మునిగిపోయాడు. దీంతో బెట్టింగ్‌ల కోసం మేనేజర్ అతని భార్య స్రవంతి తోపాటు అతని స్నేహితుడు సుబ్రహ్మణ్యంలకు సంబంధించిన ఆధార్, పాన్‌కార్డులపై బ్యాంక్‌లో నకిలీ బంగారం పెట్టి పెద్ద మొత్తంలో లోన్‌లు తీసుకున్నాడు. అలాగే రెండు ఏటీఎంల నుండి డిపాజిట్ చేసే సమయంలో కొంత కొంత




డబ్బులు పక్కన బెడుతూ రూ.31.35 లక్షల నగదును కూడా మోస పూరితంగా బ్యాంకును మోసం చేసి వాడుకున్నాడు.

ఇతనికి బ్యాంకులో బంగారాన్ని పరిశీలించే వ్యక్తి శ్రీనివాస్ చారి సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో మేనేజర్ యాదం అనిల్ తోపాటు అతని భార్య స్రవంతి, అతని స్నేహితుడు సుబ్రహ్మణ్యం, సహకరించిన శ్రీనివాస్ చారి లపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. అనిల్ గతంలో కూడా ఆంధ్ర ప్రదేశ్ వెలైపాడు పీఎస్ పరిధిలో ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ నందు పోలవరం నిర్వాసితులను, గిరిజనుల సైతం మోసం చేసి రూ.11.82,487 డబ్బులు వాడుకొని జైలు పాలయ్యాడు. ప్రస్తుతం మేనేజర్ అనిల్ పరారీలో ఉండగా అతని భార్య స్రవంతి, శ్రీనివాస్ చారి, సుబ్రహ్మణ్యంలను అరెస్ట్ చేసి కోర్టునందు హాజరు పర్చినట్లు డీఎస్పీ తెలిపారు.






Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com